ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి
"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.
అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక




సంపుటి: 6 సంచిక: 105, పేజీలు - 08
గురువారం,అక్టోబర్ 15, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD



## ప్రపంచ పెట్టుబడులకు
# గమ్యస్థానం తెలంగాణ
## సమాఖ్య బిజినెస్ సమ్మిట్ లో సీఎం రేవంత్ రెడ్డి

- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను చేస్తామన్న సీఎం
- దేశ జీడీపీలో రాష్ట్ర వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యమని వెల్లడి
- యువతతో పాటు మహిళలను ప్రోత్సహించాలన్న సీఎం రేవంత్
- కేవలం ఎన్నికల సమయంలోనే రాజకీయాలని వ్యాఖ్య

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రాన్ని అత్యుత్తమ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా యువత, మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణ రైజింగ్ 2047 లో నిర్దేశించిన ప్రణాళికలోని పెరి అర్బన్ రీజియన్‌లో స్టార్టప్‌లు, ఇతర పరిశ్రమలను ఏర్పాటు చేయడంలో యువ పారిశ్రామికవేత్తలు ఈ అద్భుతమైన అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.సమాఖ్య గ్లోబల్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్ హైటెక్స్‌లో నిర్వహించిన గ్లోబల్ బిజినెస్

2లో..




## విశ్వవేదికపై భారతీయ
# సంస్కృతి వైభవం!
### - బృహత్తర భారత్ పై ప్రధాని మోదీ సందేశం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారతదేశ సంగీతం, నృత్యం, సినిమాలు, వంటకాలు దేశాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమాజాలతో అనుసంధానిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వీటి వల్ల దేశ సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయంగా గుర్తింపు పెరుగుతోందని కొనియాడారు. చారిత్రక కట్టడాలను పరిరక్షించడంతో పాటు 'జ్ఞాన్ భారతం' కార్యక్రమం ద్వారా భారత పురాతన తాళపత్రాల వారసత్వాన్ని కూడా ప్రభుత్వం పరిరక్షిస్తోందని ఆయన తెలిపారు. అక్టోబర్ 14 నుంచి 16 వరకు ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరుగుతున్న 'బృహత్తర భారత్: ప్రపంచవ్యాప్తంగా భారతదేశ సాంస్కృతిక సంబంధాలపై అంతర్జాతీయ సదస్సు'ను ఉద్దేశించి పంపిన సందేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి వివేక్ అగర్వాల్ ప్రధాన మంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో

2లో..

## వాటాలు తేలకపోవడం వల్లే
# నైని టెండర్లు రద్దు
### - 'సింగరేణి కార్మిక గర్జన' సభలో కేటీఆర్

- కమిషన్ల కోసమే సింగరేణిని దోచుకుంటున్నారు
- సైట్ విజిట్ సర్టిఫికెట్ పేరుతో రూ.10,000 కోట్ల కుంభకోణం
- రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ల కోసం సింగరేణి సంస్థను పంచుకొని దోచుకుంటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి.రామారావు (కేటీఆర్) ఆరోపించారు. సింగరేణిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏమాత్రం శ్రద్ధ లేదని, ఆయన పాలనలో సంస్థ



2లో..

## దుర్గమ్మ సన్నిధిలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
### - నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు



**విజయవాడ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న వేళ ఆమె అమ్మవారి సన్నిధికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పర్యటన కోసం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి ఘన స్వాగతం లభించింది.

2లో..

# స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల

- మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు - తొలి దశ నవంబర్ 26న పోలింగ్
- మూడో దశ డిసెంబర్ 2న ఎన్నికలు - అమల్లోకి ఎలక్షన్ కోడ్




**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీలో స్థానిక ఎన్నికల నగారా మోగింది. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం ప్రకటించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేసింది. ఎస్ఈసీ వెల్లడించిన షెడ్యూల్ ప్రకారం మొత్తం 3 దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల నేపథ్యంలోనే ఇప్పటికే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, జడ్పీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. అన్నిచోట్లా 50 శాతం మహిళలకు సీట్లు కేటాయించారు. ఇంకా పంచాయతీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీల రిజర్వేషన్లపై ఇంకా ప్రకటన రావాల్సి ఉంది. ఏపీ స్థానిక ఎన్నికల షెడ్యూల్‌ని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ప్రకటించారు. నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎన్నికలను నిర్వహించేందుకు నోటిఫికేషన్ రిలీజ్ చేశారు. 10 నగర పంచాయతీలు, 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలకు ఈ నెల 28వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఈ పోలింగ్ ఫలితాలను 30వ తేదీన వెల్లడిస్తారు. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్18 నుంచి 10 మధ్య నామినేషన్లను సంబంధిత అధికారులు స్వీకరిస్తారు. 19 నుంచి 20 తేదీల్లో నామినేషన్లు పరిశీలిస్తారు. అక్టోబర్ 21 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది.కాగా, కోర్టు కేసుల కారణంగా 23 అర్బన్ లోకల్ బాడీలకు ఎన్నికలు జరగడం లేదు. కోర్టు కేసులు, న్యాయపరమైన వివాదాల కారణంగా ఈ పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడం లేదని ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ప్రకటించారు. వివాదాలు పరిష్కారమైన తర్వాత ఈ స్థానాలకు ఎన్నికలు జరపడానికి కొత్త తేదీలు వెల్లడిస్తామని అన్నారు. వీటిలో ఐదు కార్పొరేషన్లు, 18 మున్సిపాల్టీలు, నగర పంచాయతీలు ఉన్నాయి. శ్రీకాకుళం, కాకినాడ, రాజమండ్రి, మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్లు ఆముదాలవలస రాజాం, పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం,తణుకు, గుడివాడ, తాటిగడప, పొన్నూరు, బాపట్ల, కందుకూరు, నరసరావుపేట, కావలి, గూడూరు, శ్రీకాళహస్తి మున్సిపాల్టీలు నగర పంచాయతీలు కొత్తకోట, అల్లూరు, పొదిలి ఉన్నాయి.

2లో..

## ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో
# రాజకీయాలకు తావులేదు
### - అర్హతే ప్రామాణికమన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆ కుటుంబం ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాలకే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పరిమితమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పార్టీల తేడా లేకుండా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని సమానంగా చూస్తోందని అధికార పార్టీ ఎమ్మెల్యే ఉన్నా ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే ఉన్నా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించడంలో ఎలాంటి వివక్షకు తావులేదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా.పోచారంలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి రాష్ట్ర పరిశ్రమలు ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే

2లో..



## కరెంట్ కోతలపై సీఎం రేవంత్ ఆగ్రహం
### - అధికారులకు తీవ్ర హెచ్చరిక



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో తరచూ తలెత్తుతున్న విద్యుత్ అంతరాయాలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల పనితీరుపై ఆయన నిప్పులు చెరిగారు. ఎన్నిసార్లు ఆదేశాలు ఇచ్చినా పరిస్థితిలో మార్పు రాకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సీఎం, అధికారులు తమ తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని, ఉన్నతస్థాయి అధికారులను సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడబోనని గట్టి హెచ్చరిక జారీ చేశారు. బుధవారం విద్యుత్ సరఫరా పరిస్థితిపై సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి, అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. భవిష్యత్తులో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ, ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు పూర్తిస్థాయిలో లింకేజీలు ఉన్నప్పటికీ, విద్యుత్ ఉత్పత్తి ఆశించిన స్థాయిలో ఎందుకు జరగడం లేదని నిలదీశారు. "పదేపదే చెప్పినా మీలో చలనం రావడం లేదు.

2లో..

# యూపీఐ ఎండీఆర్ విధింపు వాయిదా
### - కేంద్రం నిర్ణయానికి వ్యాపార సంఘాలు కృతజ్ఞతలు

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ యూపీఐ) లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వాయిదా వేయడంపై వ్యాపార సంఘాలు స్పందించాయి. ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతించాయి. పండగ సీజన్ ముందు దేశవ్యాప్తంగా ఉన్న వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించిన విషయం తెలిసిందే. యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ విధించే నిర్ణయాన్ని వాయిదా వేసింది. అక్టోబర్ 15 తర్వాత ఈ ఛార్జీలను అమలు చేయాలని తొలుత భావించినప్పటికీ, వ్యాపారుల

2లో..




# హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ
### - ఇండియా కూటమి భారీ ప్లాన్ - ఈనెల 24న లక్షమంది జనసమీకరణ

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఇండియా కూటమి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ సన్నాహాలు చేస్తోంది. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్), ఓట్ల తొలగింపు ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘాన్ని ప్రశ్నిస్తూ చేపట్టనున్న ఉద్యమంలో భాగంగా ఈ సభను నిర్వహించాలని కూటమి నేతలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నెల 24వ తేదీన సభ నిర్వహణకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. సుమారు లక్ష మందిని సమీకరించడమే లక్ష్యంగా తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం ఏర్పాట్లపై దృష్టి సారిస్తోంది.హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఈ సభకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నేత,

2లో..




## రూటుమార్చిన
# కాక్రోచ్‌లు
### - మరో భారీ నిరసన ప్రకటన!



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఎస్ఐఆర్ అక్రమాల వ్యవహారానికి బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోసం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేస్తున్న ఆందోళనల్ని కేంద్రం అడ్డుకుంటోంది. రెండు రోజుల క్రితం విమానంలో ఢిల్లీకి వస్తున్న కాక్రోచ్ పార్టీ నేతల్ని

2లో..

# భారత్ తడబాటు
### - నాలుగో టీ20లో చేతులెత్తేసిన టీమిండియా



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భారీ లక్ష్యం, ఆరంభంలో దూకుడు మధ్యలో కీలక వికెట్ల పతనం చివర్లో కీమో పాల్ విజృంభణ! ఇలా ఎన్నో మలుపుల మధ్య సాగిన నాలుగో టీ20లో భారత్‌కు ఓటమి తప్పలేదు. తొలుత షాయ్ హోప్ శతకంతో విరుచుకుపడటంతో వెస్టిండీస్ 247 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో భారత బ్యాటర్లు

2లో..

# ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానం తెలంగాణ

సమ్మిట్ 2026 ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. మీ ఆలోచనలను కొత్త తరానికి అందించి తద్వారా ఆ తరాన్ని అభివృద్ధివైపు నడిపించాలన్న ఆలోచనలతో పనిచేస్తోందంటూ సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌ను ఈ సందర్భంగా అభినందించారు.

### చట్టాలపై అవగాహన కల్పించడంలో సమాఖ్యలు

రకరకాల ఆలోచనలు, ప్రపంచంలో జరుగుతున్న అభివృద్ధి, వస్తున్న నూతన విధానాలను సంపూర్ణంగా యువత తరానికి అందించాలంటే, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల విధానాలే కాకుండా ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులు, చట్టాలను కూడా అవగాహన కల్పించుకోవలసిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.యువతకు ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులు, నూతన విధానాలు, చట్టాలపై అవగాహన కల్పించడంలో సమాఖ్యలు, చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించే సదస్సులు కీలక పాత్ర పోషిస్తాయి. ఒకే వేదికపై వివిధ రంగాల అనుభవజ్ఞులను కలుసుకోవడం, వారి ఆలోచనలు, అనుభవాల నుంచి నేర్చుకోవడం ద్వారా యువతకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

### సినిమా, రాజకీయ రంగాల్లో మున్నూరు కాపులు రాణించారు

కాపు సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులు పారిశ్రామిక, రాజకీయ, న్యాయ, సినీ రంగాల్లో సాధించిన విజయాలను నమోదు చేసి భవిష్యత్ తరాలకు అందించడం ద్వారా యువతకు స్ఫూర్తినివ్వవచ్చు అని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. భారతదేశానికి 2047 అత్యంత ప్రాధాన్యత కలిగిన సంవత్సరం స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే నాటికి దేశం సాధించిన ప్రగతిని సమీక్షించుకోవడంతో పాటు, భవిష్యత్ లక్ష్యాల సాధనకు స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు సాగాలి అని పిలుపునిచ్చారు. భారత్‌ను 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న వికసిత్ భారత్--2047 లక్ష్యాన్ని సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రావాల్సిన అవసరం ఉంది అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

### తెలంగాణ రైజింగ్-2047 గ్లోబల్ సమ్మిట్

'తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2025లో తెలంగాణ రైజింగ్-2047 గ్లోబల్ సమ్మిట్ నిర్వహించి, రాష్ట్ర అభివృద్ధికి నిర్దిష్ట లక్ష్యాలను రూపొందించడంతో పాటు తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసింది. రాష్ట్రాన్ని మూడు ప్రాంతీయ ఆర్థిక విభాగాలుగా విభజించి, ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, జనాభా, వనరులకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాం'అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. 'ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని సుమారు 2,100 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో 1.34 కోట్ల జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని కోర్ అర్బన్ రీజియన్ క్యూర్ ను గుర్తించినట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటి ప్రాంతానికి తరలించి నగరంలో సర్వీస్ సెక్టార్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించాం. ఈ ప్రాంతంలోని కాలుష్యకారక పరిశ్రమలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన రాయితీలు, అనుమతులు, ఇతర సహకారం అందించాలనే ఉద్దేశంతో హిల్ట్ పాలసీని తీసుకొచ్చాం. పరిశ్రమల తరలింపు ప్రక్రియలో పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారం అందిస్తాం'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

### హైదరాబాద్ అభివృద్ధిలో ఓఆర్ఆర్ కీలక పాత్ర

'హైదరాబాద్ అభివృద్ధిలో ఓఆర్ఆర్ కీలక పాత్ర పోషించింది. మెరుగైన రవాణా అనుసంధానంతో ఐటీ, ఫార్మా, విద్య, సర్వీస్ రంగాలు విస్తరించి నగరం నాలెడ్జ్ హబ్‌గా ఎదిగింది. ఇదే తరహాలో ఓఆర్ఆర్‌కు వెలుపల సుమారు 50 కిలోమీటర్ల పరిధిలో 360 కిలోమీటర్ల మేర రీజినల్ రింగ్ రోడ్ అభివృద్ధి చేస్తున్నాం'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. 'ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్యనున్న సుమారు 10,500 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ (ప్యూర్) గా గుర్తించి, మాన్యుఫ్యాక్చరింగ్ జోన్‌గా అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. ఈ ప్రాంతం యువ పారిశ్రామికవేత్తలకు స్టార్టప్‌లు, కొత్త పరిశ్రమలు స్థాపించేందుకు గొప్ప అవకాశాలను అందిస్తుంది. రీజినల్ రింగ్ రోడ్ నుంచి రాష్ట్ర సరిహద్దుల వరకు ఉన్న సుమారు లక్ష చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ (రేర్) గా అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించాం'అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణ

'2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగాలన్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే ప్రణాళికలతో పాటు వాటి అమలుకు అవసరమైన కార్యాచరణ, పెట్టుబడులు ఎంతో కీలకం. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి. పెట్టుబడులు పెట్టి తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి'అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. 'ప్రపంచంలోని ప్రముఖ నగరాలతో పోటీపడే స్థాయికి హైదరాబాద్‌ను తీసుకెళ్లాలన్నది తమ ఆకాంక్ష. ప్రపంచ ప్రఖ్యాత కార్పొరేట్ సంస్థల్లో సేవలు అందించే వారిలో భారతీయులు ఉన్నత స్థానాల్లో ఉన్నారు. అంతవరకే పరిమితం కాకుండా మనవాళ్లు సొంతంగా స్టార్టప్‌లు స్థాపించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి.ప్రపంచ వ్యాప్తంగా మహిళల భాగస్వామ్యం పెరిగిన దేశాలు ఆర్థికంగా పురోగమిస్తున్నాయి. భారతదేశంలోనూ మహిళల పారిశ్రామిక భాగస్వామ్యాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉంది. మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోంది. యువత, మహిళలకు సమానంగా అవకాశాలు కల్పించడం ద్వారా పారిశ్రామిక రంగంలో రాష్ట్రం మరింత పురోగతి సాధించగలదు' అని సీఎం రేవంత్ రెడ్డి నొక్కి చెప్పారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కే రఘురామ కృష్ణంరాజు, ఎంపీలు డా.లక్ష్మణ్,వేం నరేందర్ రెడ్డి,ప్రభుత్వ సలహాదారు వీ హన్మంతరావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇతర ప్రజాప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

# విశ్వవేదికపై

# భారతీయ సంస్కృతి వైభవం!

కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కూడా పాల్గొన్నారు. విదేశాల నుంచి పురాతన కళాఖండాలను తిరిగి భారత్కు తీసుకువచ్చే ప్రయత్నాలు కొత్త ఊపును అందుకున్నాయని తెలిపారు. అదే సమయంలో భారతదేశ సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పెరుగుతోందని మోదీ చెప్పారు.

భారతదేశ సాంస్కృతిక వారసత్వం, సరిహద్దులకు అతీతంగా విస్తరించిన దాని నాగరికతా వారసత్వం అనే ఇతివృత్తంతో జరుగుతోంది. ఈ సదస్సును కేంద్ర సాంస్కృతిక శాఖ పరిధిలోని 'ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్' నిర్వహిస్తోంది. ప్రపంచంతో భారతదేశానికి ఉన్న చారిత్రక, సమకాలీన సాంస్కృతిక సంబంధాలపై చర్చించేందుకు ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. దీనికి వివిధ దేశాల ప్రతినిధులు, రాయబారులు, పండితులు హాజరవుతున్నారు. అలాగే, రవీంద్రనాథ్ ఠాగూర్ ఆధ్యాత్మిక మార్గదర్శకత్వంలో అప్పటి కలకత్తాలో 1926 అక్టోబర్ 14న భారతీయ పండితుల బృందం స్థాపించిన 'గ్రేటర్ ఇండియా సొసైటీ' (బృహత్తర భారత్ పరిషత్) శతజయంతి ఉత్సవాలకు కూడా ఇది వేదికైందని ఇందిరా గాంధీ

# రూటుమార్చిన కాక్రోచ్‌లు

అరెస్టు చేసి డిటెన్షన్ సెంటర్లకు తీసుకెళ్లిన పోలీసులు.. అనంతరం విడిచిపెట్టారు. ఆ తర్వాత జంతర్ మంతర్ ను ఆందోళనలు చేసే ప్రాంతాల జాబితా నుంచి తప్పించారు. దీంతో జంతర్ మంతర్ వద్దకు వెళ్లి జాతీయ జెండా ఎగరేసేందుకు ప్రయత్నించిన సీజేపీ నేతల్ని అరెస్టు చేసి తీహార్ జైలుకు పంపారు. ఈ పరిణామాలపై కాక్రోచ్ జనతా పార్టీ భగ్గుమంటోంది.ఈ నేపథ్యంలో 16వ తేదీన ఢిల్లీలో మరో భారీ నిరసన చేపట్టాలని కాక్రోచ్ జనతా పార్టీ నిర్ణయించింది. ఇప్పటికే కాక్రోచ్ పార్టీ కీలక నేతలు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ లను అరెస్టు చేసి తీహార్ జైలుకు జ్యుడిషియల్ రిమాండ్ పై పంపారు.

ఐదు రోజుల రిమాండ్ పై తీహార్ జైలుకు వారిని తరలించారు. మరోవైపు నానమ్మ మృతితో మహారాష్ట్ర వెళ్లిన సీజేపీ బాస్ అభిజీత్ దిప్కే తిరిగి వచ్చారు. దీంతో ఆయన బుధవారం కీలక ప్రకటన చేశారు.అక్టోబర్ 16న ఢిల్లీలో మరో నిరసన ప్రదర్శనను చేపట్టబోతున్నట్లు సీజేపీ ఛీఫ్ అభిజీత్ దిప్కే ప్రకటించారు. "లెహ్రా దో త్రిరంగా" అనే సందేశంతో అక్టోబర్ 16న సాయంత్రం 5 గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌లో భారీ సభ నిర్వహిస్తామని దిప్కే ప్రకటించారు. దీంతో ఇప్పటికే నిరసనల హోరుతో మార్మోగుతున్న రాజధాని నగరంలో మరో భారీ నిరసన సభ నిర్వహణ ద్వారా సత్తా చాటుకోవాలని కాక్రోచ్ లు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇప్పటికే సీజేపీ నేతలు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ ల అరెస్టులు, రిమాండ్ పై విపక్షాలు భగ్గుమంటున్నాయి. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్లు చేస్తున్నాయి. వీరి విడుదల కోసం ఢిల్లీ స్థానిక కోర్టులో సీజేపీ పిటిషన్లు కూడా దాఖలు చేసింది. వారిని ఎల్లుండి లోగా విడుదల చేయకపోతే ఢిల్లీలో సీజేపీ చేపట్టే నిరసనల్లో విపక్షాలు కూడా పాల్గొనే అవకాశం ఉంది.

# స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల

ఇక గ్రామ పంచాయతీలకు సంబంధించి తొలి దశ ఎన్నికలను నవంబర్ 26న నిర్వహించనుండగా 27న రీపోలింగ్ ఉంటుంది. నవంబర్ 26నే ఈ ఫలితాలు వెలువడుతాయి. రెండో దశ ఎన్నికలను నవంబర్ 29న నిర్వహించి, అదే రోజు ఫలితాలను కూడా వెల్లడిస్తారు. చివరి దశ ఎన్నికలను డిసెంబర్ 2న నిర్వహించి, అదే రోజు ఫలితాలను వెల్లడిస్తారు. ఇక జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను నవంబర్ 11న నిర్వహిస్తారు. నవంబర్ 5న ఆ ఫలితాలను వెల్లడిస్తారు. కాగా గ్రేటర్ విశాఖపట్నం మేయర్ అభ్యర్థిగా పోటీ చేసే వ్యక్తి గరిష్ఠంగా రూ.40 లక్షల వరకు ఎన్నికల్లో ఖర్చు చేయొచ్చని ఎలక్షన్ కమిషన్ ప్రకటించింది. ఇదిలా ఉండగా ఏపీ మున్సిపల్ ఎలక్షన్ నేపథ్యంలో ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. పోటీ చేసే అభ్యర్థులకు అవసరమైన సామాజికవర్గ, నేటివిటీ ధ్రువీకరణ సర్టిఫికెట్లను వీలైనంత త్వరగా అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని స్పష్టం చేశారు. దీంతోపాటు ఎన్నికల్లో మద్యం, నగదు ప్రలోభాలకు అడ్డుకట్ట వేయాలని ఆయన సూచించారు.

# దుర్గమ్మ సన్నిధిలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కమలేశ్ పాశ్వాన్, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, ఎంపీ వల్లభనేని బాలశౌరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు ఆమెకు స్వాగతం పలికారు.అనంతరం ఇంద్రకీలాద్రికి చేరుకున్న రాష్ట్రపతికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాష్ట్ర హోంమంత్రి అనిత, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఆలయ ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ ఆమెను ఆలయంలోకి ఆహ్వానించారు. గర్భాలయంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం, వేద పండితులు రాష్ట్రపతికి వేదాశీర్వచనాలు అందించారు. ఆలయ అధికారులు ఆమెకు పట్టువస్త్రాలు, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులను రాష్ట్రపతి ఆప్యాయంగా పలకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ ఆమె ముందుకు సాగారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

# వాటాలు తేలకపోవడం వల్లే నైని టెండర్లు రద్దు

భ్రష్టుపట్టిపోతోందని విమర్శించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో అక్టోబర్ 14న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సింగరేణి కార్మిక గర్జన' సభలో ఆయన ప్రసంగించారు. కమిషన్ల లెక్కలు తేలకపోవడం వల్లే నైని టెండర్లను ప్రభుత్వం రద్దు చేసిందని కేటీఆర్ ఆరోపించారు. నైని కుంభకోణాన్ని ఆపి రూ.30,000 కోట్లు ఆదా చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పడాన్ని ప్రస్తావిస్తూ.. ప్రభుత్వ పెద్దల మధ్య వాటాలు తేలనప్పుడే ఇలాంటి కుంభకోణాలు బయటకు వస్తాయని ఎద్దేవా చేశారు. 'సైట్ విజిట్ సర్టిఫికెట్' అనే కొత్త నిబంధన పేరుతో సింగరేణిలో సుమారు రూ.10,000 కోట్ల భారీ కుంభకోణం జరుగుతోందని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. దీనితో పాటు సోలార్, జిలెటిన్ స్టిక్స్ కొనుగోళ్లు, మరో నాలుగైదు అంశాల్లోనూ పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని దుయ్యబట్టారు. సింగరేణి కార్మికుల జీవితాలను నాశనం చేస్తున్న ఈ అక్రమాలపై ఆధారాలతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశామని కేటీఆర్ వెల్లడించారు. ఇప్పటికే సింగరేణిలో జరుగుతున్న దోపిడీపై చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి సైతం ముఖ్యమంత్రికి లేఖ రాసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అధికార పార్టీ నేతలు ఒకరినొకరు కాపాడుకుంటూ, కమిషన్ల కోసం సింగరేణిని కొల్లగొడుతున్నారని ఆయన మండిపడ్డారు. సింగరేణిలో జరుగుతున్న అవకతవకలపై బీఆర్ఎస్ చేస్తున్న పోరాటంలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయాలకు తావులేదు

మల్లారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు.

### మేడ్చల్ నియోజకవర్గంలో 480 మంది లబ్ధిదారుల ఎంపిక

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు వందల కోట్ల రూపాయలు ఉన్నప్పటికీ, పేదలు నివసించే ప్రాంతాల్లోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నగరంలో జీవనోపాధి పొందుతున్న పేదలను దూర ప్రాంతాలకు తరలించి వారి ఉపాధికి ఇబ్బందులు కలిగించే విధానానికి స్వస్తి పలుకుతున్నామని మంత్రి తెలిపారు.క్యూర్ పరిధిలో మొదటి విడతగాలక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, 23 నియోజకవర్గాల్లో పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేశామని వెల్లడించారు. ఇప్పటికే ఆరు చోట్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశామని వివరించారు. మేడ్చల్ నియోజకవర్గంలో తొలి విడతగా 480 మంది లబ్ధిదారులను పారదర్శకమైన బహిరంగ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ఇప్పటికే సొంత ఇల్లు ఉన్నవారిని గుర్తించి, అర్హతలను ధ్రువీకరించిన అనంతరం పారదర్శకంగా డ్రా నిర్వహించామని చెప్పారు. ఎంపికైన వారిలో స్థానికంగా నివసించే అర్హులనే నిర్ధారించి ఇళ్లు కేటాయిస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు.

### తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని రాష్ట్ర గృహనిర్మాణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు 2.20 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని వెల్లడించారు. త్వరలో రెండవ విడత ఇందిరమ్మ టవర్స్ కోసం మరోసారి దరఖాస్తులు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ టవర్స్‌లో ఎంపికైన లబ్ధిదారులకు కేవలం కేటాయింపు పత్రాలు ఇచ్చి సరిపెట్టబోమని, ఎలాంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా పూర్తి హక్కులతో ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసి అందిస్తామని మంత్రి ప్రకటించారు. ప్రతి అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన భూమిలో వాటాను కూడా రిజిస్ట్రేషన్‌లో పొందుపరుస్తామని రాష్ట్ర గృహనిర్మాణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

### అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేస్తాం

వచ్చే బతుకమ్మ పండుగ నాటికి తొలి విడత లబ్ధిదారులకు ఇళ్లను పూర్తి చేసి, వారి చేతుల మీదుగా తాళాలు అందించాలన్నదే తమ లక్ష్యమని రాష్ట్ర గృహనిర్మాణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. తొలి విడతలో అవకాశం దక్కని అర్హులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, తదుపరి విడతల్లో కొత్త దరఖాస్తుదారులతో సహా అర్హులందరినీ పరిశీలిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడంతో పాటు, ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని చెప్పారు. ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి, సమీప ప్రాంతాల్లోని అర్హులైన పేదలకు నిబంధనల ప్రకారం కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ఉన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కోసం సుమారు 440 కోట్ల రూపాయిలు ఖర్చు చేశామని రాష్ట్ర గృహనిర్మాణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ శాఖ ఎండీ వి.పి.గౌతమ్, కలెక్టర్ మనూచౌదరి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో లబ్ధిదారులు స్నేహ, శివకుమారి, రెహ్మతి తదితరులు మాట్లాడి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని, ప్రభుత్వ పనితీరును ప్రశంసించారు. అనంతరం ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపు జరిగింది.

# నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ పేర్కొంది.

## కరెంట్ కోతలపై సీఎం రేవంత్ ఆగ్రహం

ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చూస్తూ ఊరుకోవాలా? ఇదే నిర్లక్ష్యం కొనసాగితే ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (స్పెషల్ చీఫ్ సెక్రటరీ), జెన్‌కో సీఎండీ సహా ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. విద్యుత్ కోతలకు గల కారణాలపై తక్షణమే నివేదిక ఇవ్వాలని, సరఫరాను సాధారణ స్థితికి తెచ్చేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

# యూకే మేయర్లతో సీఎం భేటీ

అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మేయర్ల ప్రతినిధి బృందం కలిసింది. ఈ సమావేశంలో తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా హెల్త్‌కేర్, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, ఏరోస్పేస్, టెక్స్‌టైల్స్, పరిశోధన, తయారీ రంగాల్లో పెట్టుబడులకు గల అవకాశాలను సీఎం వారికి వివరించారు. రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వ్యాపార అనుకూల వాతావరణం ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా "యూకే-ఇండియా సీఈటీఏ అండ్ రీజనల్ సినర్జీస్" అనే అంశంపై యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ రూపొందించిన నివేదికను సీఎం ఆవిష్కరించారు. అనంతరం, డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న "ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026"కు హాజరు కావాల్సిందిగా యూకే ప్రతినిధులను ఆయన సాదరంగా ఆహ్వానించారు.

# హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు ఇండియా కూటమిలోని ఇతర జాతీయ స్థాయి నాయకులు హాజరయ్యే అవకాశం ఉందని హస్తం పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే నేతల హాజరు, సభా వేదిక, సమయం వంటి వివరాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌తో పాటు ఇతర అనువైన ప్రదేశాలను సభా వేదికగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో రవాణా, భద్రత, వాహనాల పార్కింగ్, ఇతర ఏర్పాట్లపై పార్టీ నాయకత్వం దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది.ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాల నుంచి తొలగించకుండా చర్యలు తీసుకోవాలని.. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం రికార్డులు, అధికారిక వివరాల ఆధారంగా పరిశీలించాల్సి ఉన్నప్పటికీ.. ఈ అంశం విపక్షాల రాజకీయ ఉద్యమంలో ప్రధానంగా మారింది. ఈ క్రమంలోనే గత కొన్నిరోజులుగా దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలు, ఆందోళనలు చేస్తున్నారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఆయనను పదవి నుంచి తొలగించాలని ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలన్న డిమాండ్‌ను కూడా ముందుకు తెస్తున్నారు. ఈ డిమాండ్లు నెరవేరే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తేల్చి చెప్పారు.ఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి నేతల సమావేశంలో ఓట్ల తొలగింపు ఆరోపణలపై సంయుక్త కార్యాచరణ గురించి చర్చించినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. దసరా తర్వాత దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని కూటమి భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో నవంబర్ 1వ తేదీన భారీ సభ నిర్వహించే అవకాశాన్ని కూడా నేతలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాల్లోనూ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఇండియా కూటమి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.ఢిల్లీలో నిరసన కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి జంతర్ మంతర్‌పై విధించిన ఆంక్షలను కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ విధానాలపై ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉండాలని.. నిరసనలకు అనువైన వేదికలు అందుబాటులో ఉండాలని వారు అభిప్రాయపడుతున్నారు. ఒక నిరసన వేదికపై ఆంక్షలు విధిస్తే దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఆందోళనలు చేపడతామని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి వ్యాఖ్యానించారు.మరోవైపు రాహుల్ గాంధీపై బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. రాహుల్ గాంధీ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల నుంచి స్పందన వస్తుండటంతోనే బీజేపీ విమర్శలకు దిగుతోందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ప్రతిపాదిత సభ ద్వారా జాతీయ స్థాయిలో ఓటర్ల జాబితాల అంశాన్ని ముందుకు తీసుకెళ్లడంతో పాటు తెలంగాణలో పార్టీ శ్రేణులను సమీకరించాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. లక్ష మంది పాల్గొనేలా జనసమీకరణ చేయడం, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే నేతల పర్యటనలను సమన్వయం చేయడం వంటి అంశాలపై దృష్టి పెట్టనున్నారు.అయితే ఈ బహిరంగ సభ నిర్వహణ తేదీ, వేదిక, పాల్గొనే జాతీయ నాయకుల జాబితా, జనసమీకరణ లక్ష్యం వంటి అంశాలపై పార్టీ నుంచి అధికారిక ప్రకటన వచ్చిన తర్వాతే పూర్తి స్పష్టత రానుంది. ఎన్నికల ప్రక్రియపై ఆరోపణలు, వాటికి సంబంధించిన అధికారిక వివరణలు, ప్రతిపక్షాల డిమాండ్లు ఈ సభలో ప్రధాన చర్చనీయాంశాలుగా మారే అవకాశం ఉంది.

# యూపీఐ ఎండీఆర్ విధింపు వాయిదా

నుంచి వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో గడువును పొడిగించింది. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించిన వ్యాపార సంఘాలు, ఎండీఆర్ ప్రతిపాదనను శాశ్వతంగా రద్దు చేయాలని కూడా విజ్ఞప్తి చేశాయి. యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ విధిస్తే వ్యాపార నిర్వహణ ఖర్చులు పెరుగుతాయని, ముఖ్యంగా దీపావళి వంటి పండగ సీజన్‌లో డిజిటల్ లావాదేవీలు ఎక్కువగా జరిగే సమయంలో ఇది తమపై అదనపు భారం మోపుతుందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న నిర్ణయం వ్యాపారులకు ఉపశమనం కలిగించింది. ఈ నిర్ణయంపై చాందినీ చౌక్ ట్రేడర్స్ కౌన్సిల్ కోశాధికారి రాజీవ్ అగర్వాల్ మాట్లాడుతూ, "ఇది చాలా మంచి నిర్ణయం. ప్రధాని నరేంద్ర మోదీ మొదటి నుంచి వ్యాపారుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారు. ఎండీఆర్ అమలు నిర్ణయం వాస్తవానికి వ్యాపారులపై గానీ, కొనుగోలుదారులపై గానీ పెద్దగా ప్రభావం చూపేది కాదు. అప్పుడు ఆ నిర్ణయాన్ని స్వాగతించాం. ఇప్పుడు దాని వాయిదాను కూడా స్వాగతిస్తున్నాం" అని ఐఏఎన్ఎస్‌కు తెలిపారు.సదర్ బజార్ బారీ మార్కెట్ ట్రేడర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పరమ్‌జీత్ సింగ్ మాట్లాడుతూ "ఇది కచ్చితంగా సరైన నిర్ణయం. మేం దీనిని స్వాగతిస్తున్నాం. ఈ అంశంపై మేం నిరసన తెలిపి, పునఃపరిశీలించాలని ప్రభుత్వాన్ని కోరాం. పండగ సమయంలో ఈ ఛార్జీల వల్ల వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు" అని అన్నారు. ఢిల్లీ శారీ మర్కంటైల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రాజ్‌కుమార్ భరద్వాజ్ స్పందిస్తూ.. "ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వ్యాపారులకు, వినియోగదారులకు ఇద్దరికీ ప్రయోజనకరం. ఎందుకంటే ఎండీఆర్ వల్ల వ్యాపారికి ఖర్చు పెరిగితే, ఆ భారాన్ని వస్తువుల ధరలలో కలుపుతారు. దాని ప్రత్యక్ష ప్రభావం వినియోగదారుడిపైనే పడుతుంది" అని వివరించారు. ఈ నిర్ణయం పట్ల ఢిల్లీలోని ఇతర దుకాణదారులు కూడా సంతృప్తి వ్యక్తం చేశారు. యూపీఐపై ఎలాంటి ఛార్జీలు లేకపోవడం వల్ల కస్టమర్లు ఎలాంటి సంకోచం లేకుండా డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారని పేర్కొన్నారు.

# భారత్ తడబాటు

పోరాడినా, కీలక సమయంలో వికెట్లు కోల్పోవడంతో విజయం అందలేదు. కీమో పాల్ నాలుగు ఓవర్లలో 41 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టి భారత బ్యాటింగ్ వెన్ను విరిచాడు. దీంతో ఐదు టీ20ల సిరీస్‌లో ఇరు జట్లు రెండేసి విజయాలు సాధించాయి. బెంగళూరులో శనివారం జరగనున్న ఐదో మ్యాచ్ సిరీస్ డిసైడర్ కానుంది.248 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు సంజూ శాంసన్ అదిరిపోయే ఆరంభం ఇచ్చాడు. అతడు కేవలం 23 బంతుల్లో 56 పరుగులు చేశాడు. ఆరు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో విండీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. వేగంగా పరుగులు సాధిస్తూ భారత్ విజయంపై ఆశలు రేపాడు. అయితే కీమో పాల్ వేసిన ఓవర్‌లో శాంసన్ క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో భారత్‌కు తొలి ఎదురుదెబ్బ తగిలింది.ఇదే ఓవర్‌లో ఇషాన్ కిషన్ కూడా ఔటయ్యాడు. మూడు బంతులు ఎదుర్కొన్న అతడు ఆరు పరుగులే చేసి కీమో పాల్ బౌలింగ్‌లో జువెల్ ఆండ్రూకు క్యాచ్ ఇచ్చాడు. దూకుడుగా ఆడాల్సిన సమయంలో ఇషాన్ త్వరగా వెనుదిరగడం భారత్‌పై ఒత్తిడి పెంచింది. అభిషేక్ శర్మ 24 బంతుల్లో 29 పరుగులు చేశాడు. మూడు ఫోర్లు, ఒక సిక్సర్ బాదిన అతడిని గుడాకేశ్ మోటీ పెవిలియన్‌కు పంపాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 11 బంతుల్లో 16 పరుగులు చేసి శమర్ స్ప్రింగర్ బౌలింగ్‌లో జువెల్ ఆండ్రూకు క్యాచ్ ఇచ్చాడు. దీంతో భారత్ కీలక వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది.

### తెలుగు కుర్రాళ్ల పోరాటం

మధ్య ఓవర్లలో తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి భారత ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టేందుకు ప్రయత్నించారు. తిలక్ దూకుడుగా ఆడుతూ సిక్సర్లతో స్కోరు వేగాన్ని పెంచాడు. అతడు 25 బంతుల్లో 45 పరుగులు చేశాడు. కానీ, షెపర్డ్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడే క్రమంలో పావెల్‌కు క్యాచ్ రూపంలో దొరికిపోయాడు. నితీశ్ కుమార్ రెడ్డి కూడా కీలక సమయంలో వేగంగా పరుగులు సాధించాడు. అతడు 20 బంతుల్లో 41 పరుగులు చేసి తిలక్ వర్మ తరహాలోనే భారీ షాట్ ఆడే ప్రయత్నం చేసి పావెల్‌కు క్యాచ్ ఇచ్చాడు. భారీ లక్ష్యాన్ని ఛేదించాలంటే చివరి ఓవర్లలో పరుగుల వేగం పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో భారత బ్యాటర్లపై ఒత్తిడి పెరిగింది. భారీ షాట్లు ఆడే ప్రయత్నంలో వికెట్లు కోల్పోవడంతో విజయావకాశాలు దెబ్బతిన్నాయి.

### కీమో పాల్ ఐదు వికెట్ల విజృంభణ

చివరి ఓవర్లలో కీమో పాల్ భారత బ్యాటర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. వరుసగా వికెట్లు తీస్తూ ఛేదనను విండీస్ వైపు తిప్పాడు. నాలుగు ఓవర్లు వేసి 41 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. లక్ష్యం అందుకోవడం కష్టంగా మారడంతో భారత బ్యాటర్లు భారీ షాట్లు ఆడేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో క్యాచ్‌ల రూపంలో వికెట్లు సమర్పించుకున్నారు. చివరకు అర్ష్‌దీప్ సింగ్ రిటైర్డ్ హర్ట్ కావడంతో భారత్ ఇన్నింగ్స్ ముందుగానే ముగిసింది. భారత్ 19.3 ఓవర్లలో 223 పరుగులు చేసింది. భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో భారత బ్యాటర్లు చివరి వరకు పోరాడినా, కీమో పాల్ బౌలింగ్ ముందు నిలవలేకపోయారు.

### హోప్ శతకం.. విండీస్‌కు భారీ స్కోరు

అంతకుముందు టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. అయితే వెస్టిండీస్ బ్యాటర్లు భారత బౌలర్లపై విరుచుకుపడ్డారు. కెప్టెన్ షాయ్ హోప్ 50 బంతుల్లో 102 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అతడి ఇన్నింగ్స్‌లో నాలుగు ఫోర్లు, తొమ్మిది సిక్సర్లు ఉన్నాయి. ఆరంభం నుంచి చివరి వరకు దూకుడుగా ఆడుతూ భారత బౌలర్లకు కష్టాలు తెచ్చిపెట్టాడు.జువెల్ ఆండ్రూ 16 బంతుల్లో 21 పరుగులు చేసి జట్టుకు మంచి ఆరంభం ఇచ్చాడు. అతడిని అక్షర్ పటేల్ ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన షిమ్రోన్ హెట్‌మైర్ కేవలం 12 బంతుల్లో 33 పరుగులు చేశాడు. నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అతడిని ప్రిన్స్ యాదవ్ క్యాచ్ అండ్ బౌల్డ్‌గా ఔట్ చేశాడు.రోవ్‌మన్ పావెల్ 17 బంతుల్లో 24 పరుగులు చేశాడు. అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో సంజూ శాంసన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మరోవైపు షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ 26 బంతుల్లో 49 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. హోప్‌తో కలిసి చివరి ఓవర్లలో వేగంగా పరుగులు సాధించాడు.దీంతో వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్లకు 247 పరుగులు చేసింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, అక్షర్ పటేల్ తలో వికెట్ తీశారు. మయాంక్ యాదవ్ నాలుగు ఓవర్లలో 52 పరుగులు ఇవ్వగా, అర్ష్‌దీప్ కూడా 52 పరుగులు సమర్పించుకున్నాడు. భారీ స్కోరును కాపాడుకోవడంలో విండీస్ బౌలర్లు విజయవంతమయ్యారు.

# కూష్మాండదుర్గగా భ్రమరాంబమ్మ

## శ్రీశైలంలో వైభవంగా దసరా మహోత్సవాలు

## నాలుగో రోజు విశేష పూజలు.. రాత్రి కాళరాత్రి పూజ

## నేడు కైలాస వాహనంపై స్వామి, అమ్మవార్ల దర్శనం



శ్రీశైలం(ప్రశ్న న్యూస్) శ్రీశైల క్షేత్రంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిభావంతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన బుధవారం శ్రీ భ్రమరాంబికా అమ్మవారిని కూష్మాండదుర్గ స్వరూపంలో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి కుంకుమార్చనలు, నవావరణార్చనలు, చండీహోమం, వేద పారాయణాలు, జపానుష్ఠానాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. రాత్రి అమ్మవారి ఆస్థాన సేవ, సువాసినీ పూజల అనంతరం కాళరాత్రి పూజ నిర్వహించేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేసింది.

### సృష్టికి ఆది స్వరూపిణి

నవదుర్గలలో నాలుగో రూపమైన కూష్మాండదుర్గాదేవిని ఎనిమిది భుజాలు కలిగిన అష్టభుజాదేవిగా కొలుస్తారు. జగత్తంతా చీకటిమయంగా ఉన్న సమయంలో బ్రహ్మాండాన్ని సృష్టించిన శక్తి స్వరూపిణిగా అమ్మవారిని భక్తులు ఆరాధిస్తారు. కూష్మాండాదేవిని పూజించడం వల్ల ఆరోగ్యం, ఆయుష్షు, యశస్సు వృద్ధి చెందుతాయని భక్తుల విశ్వాసం. ఈ అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు.

### వేద మంత్రాలతో విశేష పూజలు

నాలుగో రోజు ఉదయం అమ్మవారికి ప్రాతఃకాల పూజలతో పాటు విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనలు నిర్వహించారు. జపానుష్ఠానాలు, పారాయణాలు, సూర్య నమస్కారాలు, చండీహోమం, పంచాక్షరి, భ్రామరి, బాలా జపాలు నిర్వహించారు. చండీ పారాయణం, చతుర్వేద పారాయణాలు, కుమారీ పూజలు జరిగాయి. స్వామివారికి రుద్రహోమం, రుద్రయాగాంగ జపాలు, రుద్ర పారాయణాలు నిర్వహించారు.సాయంత్రం నవావరణార్చన, కుంకుమార్చన, చండీహోమం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగనున్నాయి. రాత్రి 9 గంటల నుంచి అమ్మవారి ఆస్థాన సేవ, సువాసినీ పూజలు నిర్వహించి, రాత్రి 10 గంటల నుంచి కాళరాత్రి పూజ జరపనున్నారు.

### బాలికలే అమ్మవారి స్వరూపాలు

నవరాత్రుల్లో ప్రతిరోజూ నిర్వహించే కుమారీ పూజకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. రెండేళ్ల నుంచి పదేళ్లలోపు బాలికలను అమ్మవారి స్వరూపాలుగా భావించి పూలు, పండ్లు, నూతన వస్త్రాలు సమర్పించి పూజిస్తారు. శక్తి ఆరాధనలో భాగంగా నిర్వహించే ఈ సంప్రదాయం నవరాత్రి వేడుకల్లో విశిష్ట స్థానాన్ని పొందింది.

### నేడు కైలాస వాహనసేవ

దసరా మహోత్సవాల్లో భాగంగా శ్రీశైలంలో స్వామి, అమ్మవార్లకు నిర్వహించే వాహనసేవల్లో కైలాస వాహనసేవ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి కైలాస వాహనంపై కొలువుదీర్చి పూజాదికాలు నిర్వహించనున్నారు. శివపార్వతుల దివ్య స్వరూపాలను కైలాస వాహనంపై దర్శించుకునే అవకాశం భక్తులకు కలగనుంది.

# తొమ్మిది స్లాబుల భవనంపై

# అరకొర కూల్చివేతలు

- కమిషనర్ ఆదేశాలు బేఖాతరు.. టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరుపై విమర్శలు






శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్) సీఎంసీ శేర్లింగంపల్లి సర్కిల్ గచ్చిబౌలి జేవీ కాలనీలో తొమ్మిది స్లాబులతో నిర్మిస్తున్న భవనంపై కూల్చివేతలు అరకొరగా సాగడం విమర్శలకు తావిస్తోంది. గత నెల 15న కొన్ని పత్రికల్లో ఈ నిర్మాణంపై కథనం ప్రచురితం కావడంతో స్పందించిన జోనల్ కమిషనర్ చర్యలకు ఆదేశించారు.
అంజయ్యనగర్‌లో భవనం కూలిన ఘటన అనంతరం కమిషనర్ అక్రమ నిర్మాణాలపై ప్రతిరోజూ ప్రత్యేక కూల్చివేతలు చేపట్టాలని ఆదేశించినప్పటికీ, బుధవారం జేవీ కాలనీలో ఒక చిన్న స్లాబ్‌ను మాత్రమే తొలగించారు. కూల్చివేతల ప్రక్రియను కొందరు అధికారులు ఆదాయ వనరుగా మార్చుకున్నారనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.
పోలీసు బందోబస్తు లేకపోవడంతో పూర్తిస్థాయిలో కూల్చివేతలు చేపట్టలేదని, దసరా తర్వాత మిగిలిన అక్రమ స్లాబులను తొలగిస్తామని టీపీఎస్ అక్బర్ తెలిపారు. పేదల చిన్న నిర్మాణాలపై వేగంగా చర్యలు తీసుకుంటూ, భారీ భవనాలపై ఎందుకు వెనుకాడుతున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సీఎంసీ కమిషనర్, చీఫ్ సిటీ ప్లానర్ స్పందించి నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


టీపీఓ. అక్బర్

# ముత్యాల పందిరిపై రామవైభవం

## ధనుర్భంగ ఘట్టాన్ని తలపించిన అలంకారం

## గోవింద నామస్మరణతో మార్మోగిన తిరుమల



తిరుమల (ప్రశ్న న్యూస్) తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు ముత్యపుపందిరి వాహనసేవ వైభవంగా సాగింది. బుధవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామివారు ముత్యపుపందిరిపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. సీతా స్వయంవరంలోని ధనుర్భంగ ఘట్టాన్ని తలపించేలా శ్రీరామచంద్రుని అలంకారంలో స్వామివారు, సీతా లక్ష్మణుల అలంకారంలో అమ్మవార్లు కనువిందు చేశారు.ముత్యాల పందిరిపై దేదీప్యమానంగా వెలిగిన స్వామివారి దివ్యమంగళ స్వరూపం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. వివిధ కళాబృందాల ప్రదర్శనలు వాహనసేవకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గోవింద నామస్మరణలతో మాడ వీధులు మార్మోగగా, పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.ముత్యాలు ప్రశాంతతకు ప్రతీకలుగా భావిస్తారు. ముత్యపుపందిరిపై స్వామివారి విహారం భక్తులకు ఆధ్యాత్మికానందాన్ని పంచింది. ఈ దివ్యదర్శనంతో మనశ్శాంతి, సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు జానకీ దేవి, రంగశ్రీ, నరేష్‌కుమార్, జేఈవో గోపినాథ్, సీవీఎస్వో కేవీ మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికుల భద్రతే ధ్యేయంగా 'హైలో' యాప్

## సర్జ్ ఛార్జీలు లేవు.. బైక్, ఆటోలకు జీరో కమిషన్

## యాప్‌ను ప్రారంభించిన ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, అంతర్జాతీయ స్థాయి సంస్థలతో పోటీపడేలా స్థానిక స్టార్టప్ కంపెనీలు నూతన సాంకేతికతతో ముందుకు రావడం అభినందనీయమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. నగరంలోని సోమాజిగూడ మెర్క్యూర్ హోటల్‌లో తెలంగాణకు చెందిన ఎస్‌కే రైడో సంస్థ రూపొందించిన 'హైలో' (ఝిఅశ్రీశీ) రైడ్ హైలింగ్ యాప్‌ను సంస్థ నిర్వాహకులు శ్రీకాంత్, మహర్షిలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్థానిక స్టార్టప్ సంస్థలకు ప్రభుత్వం, ప్రజల నుంచి ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా రూపొందించిన హైలో యాప్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. బైక్, ఆటో, కార్ల ప్రయాణాలకు ఒకే యాప్ ద్వారా సేవలు అందించడం, సర్జ్ ప్రైసింగ్ లేకుండా పారదర్శక చార్జీలు అమలు చేయడం ప్రత్యేకతలని పేర్కొన్నారు. ఈ యాప్ ఆండ్రాయిడ్, ఐఓఎస్ ఫోన్లలో అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ప్రయాణికుల భద్రత కోసం 24 గంటల అత్యవసర సహాయ సేవలు, రాపిడ్ ఎస్ఓఎస్, సైలెంట్ అలర్ట్ వంటి ప్రత్యేక సదుపాయాలను అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రయాణ వివరాలను ముందుగా ఎంపిక చేసుకున్న ముగ్గురు వ్యక్తులకు పంపించుకునే అవకాశం ఉందన్నారు. ప్రయాణ సమయంలో వాహనం అనుకోకుండా చెడిపోతే ప్రత్యామ్నాయ వాహనం ద్వారా ప్రయాణికులను గమ్యస్థానానికి చేర్చే సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన డ్రైవర్లు, ముందుగా నిర్ణయించిన పారదర్శక చార్జీలు, టిప్ ఇవ్వాల్సిన అవసరం లేకపోవడం ఈ యాప్ ప్రత్యేకతలుగా పేర్కొన్నారు. డ్రైవర్లకు సులభమైన నమోదు ప్రక్రియ, సరళమైన ప్రణాళికలు, పారదర్శక ధరల విధానం, కిలోమీటరుకు మెరుగైన ఆదాయం కల్పించడమే లక్ష్యంగా యాప్‌ను రూపొందించినట్లు సంస్థ ప్రతినిధులు వివరించారు. ప్రతి ప్రయాణం అనంతరం డ్రైవర్లకు చెల్లింపులు చేసే విధానంతో పాటు బైక్, ఆటో సేవలపై ఎలాంటి కమీషన్ వసూలు చేయకుండా సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీకే రెడ్డి గ్రూపుల ఛైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, సామాజిక కార్యకర్త మంజుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హబ్సిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా

# చింతకింది ప్రవీణ్ నియామకం

## పార్టీ బలోపేతానికి కృషి చేస్తా ప్రజా సమస్యలపై

## పోరాడతా: చింతకింది ప్రవీణ్



ఉప్పల్ ( ప్రశ్న న్యూస్ ) హబ్సిగూడ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా చింతకింది ప్రవీణ్ నియమితులయ్యారు. తనపై నమ్మకంతో కీలక బాధ్యతను అప్పగించిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చింతకింది ప్రవీణ్ మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ హబ్సిగూడ డివిజన్‌లో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని, పార్టీ అధిష్ఠానం ఇచ్చే పిలుపు మేరకు నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేస్తానని పేర్కొన్నారు.రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తానని, తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన వెల్లడించారు. పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలను కలుపుకొని ముందుకు సాగుతానని స్పష్టం చేశారు.
తన నియామకానికి సహకరించిన మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, భేతి సుభాష్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు గిరి వర్ధన్ రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, మాజీ కౌన్సిలర్ తిండేరు

# వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలి

## బస్తీ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

## ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి: డా. పుట్ల శ్రీనివాస్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్ సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.బుధవారం కింగ్‌కోఠి క్లస్టర్ పరిధిలోని డీబీఆర్ మిల్స్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, ప్రయోగశాల, వివిధ రికార్డులు, పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు. గర్భిణులు, చిన్నారులకు అందిస్తున్న వైద్య సేవలతో పాటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

### టీకాల కార్యక్రమంలో వంద శాతం లక్ష్యం సాధించాలి

పిల్లలందరికీ వంద శాతం వ్యాధి నిరోధక టీకాలు అందించాలని డీఎంహెచ్ఓ సూచించారు. ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన అన్ని రకాల వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచుకోవాలని, వాటి నిల్వ, శీతలీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.అర్హులైన బాలికలను గుర్తించి హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందించే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

### దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మందులు అందుబాటులో ఉంచాలి

నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (అంటువ్యాధులు కాని దీర్ఘకాలిక వ్యాధులు) సర్వే, స్క్రీనింగ్, ఫాలోఅప్ కార్యక్రమాలను ప్రతిరోజూ నిర్వహించాలని డా. పుట్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి అవసరమైన మందులను అందుబాటులో ఉంచి, నిరంతర వైద్య పర్యవేక్షణ కల్పించాలని పేర్కొన్నారు.పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో అన్ని రకాల అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

### సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

మలేరియా, డెంగీ, చికున్‌గునియా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇంటింటి ఆరోగ్య సర్వేలను సమర్థవంతంగా నిర్వహించి, ప్రజలకు వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ, వ్యక్తిగత ఆరోగ్య జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేయాలని, వైద్యులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ సూచించారు.ఈ పర్యటనలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. సాయిబాబా పాల్గొన్నారు. ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డా. అవంతి, ఇతర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

# సింహ వాహనానికి కళా వైభవం

## పది రాష్ట్రాల కళారూపాలు..

## గోవింద నామస్మరణతో తిరుమాడ వీధులు



తిరుమల (ప్రశ్న న్యూస్) ఏడుకొండలవాడి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. శ్రీ మలయప్పస్వామివారి సింహ వాహనసేవకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తి సంగీతం, శాస్త్రీయ నృత్యాలు, జానపద కళారూపాల సమ్మేళనంతో తిరుమాడ వీధులు ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని సంతరించుకున్నాయి. పది రాష్ట్రాలకు చెందిన 17 కళాబృందాల్లోని 491 మంది కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తులను అలరించారు.

### అడుగడుగునా కళా ప్రదర్శనలు

సింహ వాహనసేవ సాగిన మార్గంలో కళాకారులు లయబద్ధమైన నృత్యాలతో శ్రీవారి వైభవాన్ని చాటారు. భరతనాట్యం, కూచిపూడి వంటి శాస్త్రీయ నృత్యాలతోపాటు రాజస్థాన్‌కు చెందిన ఘూమర్, కల్బేలియా, డోంగ్రీ నృత్యం, హాళక్కి సుగ్గి కునిత, కంగీ విన్యాసాలు, యోగ్ చాప్, డ్రమ్స్ ప్రదర్శనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. సంప్రదాయ వస్త్రధారణలో కళాకారులు చేసిన నృత్యాభినయాలు తిరుమాడ వీధులకు కొత్త శోభను తీసుకొచ్చాయి.

### అన్నమయ్య సంకీర్తనలకు నృత్యరూపం

తెలంగాణ కళాకారులు అన్నమయ్య పదావళికి నృత్యరూపకాన్ని జోడించి భక్తిభావాన్ని చాటారు. తిరుపతి బాలమందిరం విద్యార్థులు కోలాట ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. మేళతాళాలు, మృదంగ నాదాలు, గజ్జెల సవ్వడుల నడుమ కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. గాత్ర సంగీతం, వాద్యాల లయకు అనుగుణంగా హస్తముద్రలు, అంగవిన్యాసాలతో దైవలీలలను ఆవిష్కరించారు.

### భక్తి.. కళ.. సంప్రదాయాల సంగమం

శ్రీవారి వాహనసేవలో కళాకారుల ప్రదర్శనలు భక్తి పారవశ్యాన్ని మరింత పెంచాయి. ఒకవైపు గోవింద నామస్మరణలు.. మరోవైపు సంప్రదాయ వాయిద్యాల మోతలు.. ఇంకోవైపు లయబద్ధమైన నృత్యాలు.. ఇలా తిరుమాడ వీధులు ఆధ్యాత్మిక కళావేదికగా మారాయి. భిన్న రాష్ట్రాల కళారూపాలు ఒకే వేదికపై ప్రదర్శితమవడం భారతీయ సంస్కృతిలోని వైవిధ్యానికి ప్రతీకగా నిలిచింది.శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో కళా ప్రదర్శనలకు ప్రాధాన్యమివ్వడం ద్వారా భారతీయ కళలు, సంస్కృతి, సంప్రదాయాలను భక్తులకు పరిచయం చేసే అవకాశం కలుగుతోంది. సింహ వాహనసేవలో కళాకారుల ప్రదర్శనలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచాయి.

# జనసేనలోకి వంగవీటి రాధాకృష్ణ

### పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరిక..

### కండువా కప్పి సాదర స్వాగతం



అమరావతి(ప్రశ్న న్యూస్) జనసేన పార్టీలోకి మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ చేరారు. దివంగత వంగవీటి మోహన రంగా తనయుడైన రాధాకృష్ణకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. బుధవారం సాయంత్రం జనసేన కేంద్ర కార్యాలయానికి చేరుకున్న రాధాకృష్ణకు పవన్ కల్యాణ్ ఆత్మీయ ఆలింగనంతో స్వాగతం పలికారు.

#### అనుచరులతో కలిసి రాక

పార్టీలో చేరిన అనంతరం వంగవీటి రాధాకృష్ణ తన అనుచరులను పవన్ కల్యాణ్‌కు పరిచయం చేశారు. వారందరితోనూ పవన్ కల్యాణ్ ఆప్యాయంగా మాట్లాడారు. ప్రతి ఒక్కరితో ప్రత్యేకంగా ఫొటోలు దిగుతూ వారిని ఉత్సాహపరిచారు.

#### ప్రజాసేవలో కలసి ముందుకు..

జనసేన పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా అందరూ కలసికట్టుగా పనిచేయాలని పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా సూచించారు. ప్రజాసేవే లక్ష్యంగా సమష్టిగా ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. రాధాకృష్ణ పార్టీలో చేరడంతో ఆయన అనుచరుల్లోనూ కొత్త ఉత్సాహం నెలకొంది. దివంగత వంగవీటి మోహన రంగా వారసుడిగా రాజకీయాల్లో గుర్తింపు పొందిన రాధాకృష్ణ జనసేనలో చేరడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయన రాకతో పార్టీ కార్యకలాపాల్లో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# జనసేనలోకి వైసీపీ నేతలు.. పలువురు ప్రముఖులు

### పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరిక..

### ప్రజాక్షేత్రంలో నిస్వార్థంగా పనిచేయాలని పిలుపు



అమరావతి(ప్రశ్న న్యూస్) జనసేన పార్టీలోకి వైసీపీ నాయకులతో పాటు వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు చేరారు. బుధవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

#### పార్టీలో చేరిన ప్రముఖులు వీరే..

జనసేనలో చేరిన వారిలో వైసీపీ నాయకుడు, శ్రీకాకుళం మాజీ డీసీసీబీ ఛైర్మన్ డోలా జగన్, తిరుపతికి చెందిన పెనుమాదు ప్రణీత్, ఆచంటకు చెందిన జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకుడు తుంగ నాగేశ్వరరావుతో పాటు వివిధ రంగాలకు చెందిన ఏడీఎస్ ప్రసాద్, మారుతి, దోవరీ అమర్‌నాథ్ ఉన్నారు.

#### ప్రజల్లోకి పార్టీ ఆశయాలు తీసుకెళ్లాలి

పార్టీలో చేరిన వారితో పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జనసేన పార్టీ ఆశయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజాక్షేత్రంలో నిస్వార్థంగా కష్టపడుతూ ప్రజలకు సేవలందించాలని సూచించారు. వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు, ప్రముఖులు జనసేనలో చేరడంతో ఆయా ప్రాంతాల్లో పార్టీ కార్యకలాపాలు, ప్రజా సంబంధాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# మహాచండీదేవిగా దుర్గమ్మ దర్శనం

### ఇంద్రకీలాద్రిపై ప్రత్యేక పూజలు.. చండీ శ్లోకాల పఠనంతో ఆధ్యాత్మిక శోభ



విజయవాడ(ప్రశ్న న్యూస్) ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ కనకదుర్గమ్మవారు శ్రీ మహాచండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదిశక్తి స్వరూపిణిగా, దుష్టశక్తుల సంహారిణిగా అమ్మవారిని కొలుస్తూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

#### చండీ మంత్రాలతో పూజలు

మహాచండీదేవి అనుగ్రహం కోసం భక్తులు పుష్పాలు, పసుపు, కుంకుమ, అక్షతలు సమర్పించి పుష్పార్చనలు చేశారు. కుటుంబ క్షేమం, ఆరోగ్యం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. ‘ఓం శ్రీ మహాచండికాయై నమః’ మంత్రాన్ని జపిస్తూ నైవేద్యాలు సమర్పించి హారతులు ఇచ్చారు.

#### శక్తి స్వరూపిణిగా ఆరాధన

శరన్నవరాత్రుల్లో మహాచండీదేవి ఆరాధనకు విశేష ప్రాధాన్యం ఉందని భక్తులు విశ్వసిస్తారు. ఈ సందర్భంగా చండీ శ్లోకాలను పఠిస్తూ అమ్మవారిని స్తుతించారు.

#### సర్వమంగళ మాంగల్యే శివే సర్వార్థ సాధికే..

#### శరణ్యే త్ర్యంబకే గౌరి నారాయణి నమోస్తుతే..

అనే శ్లోకంతో పాటు ‘ఓం ఐం హ్రీం క్లీం చాముండాయై విచ్చే’ మంత్రాన్ని జపించారు. మహాచండీదేవి ఆరాధనతో ధైర్యం, శక్తి, ధర్మంపై విశ్వాసం పెంపొందుతాయని భక్తుల నమ్మకం. అమ్మవారి కృపతో ప్రజలందరికీ సుఖశాంతులు, సౌభాగ్యం కలగాలని భక్తులు ఆకాంక్షించారు.

# సేవలో తండ్రికి తగ్గ తనయుడు.. ఆపదలో నేనున్నానంటూ ముందడుగు

### రామన్నగారి మణికంఠ గౌడ్ సేవా స్ఫూర్తి..

### భక్తితో పాటు మానవత్వానికి పెద్దపీట

### 2026 సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 21వరకు

### 41 రోజుల పాటు అన్నదానం..

### మాలలోఉన్నవారికి లేని వారికీ భోజన వసతి





మేడ్చల్ (ప్రశ్న న్యూస్) సేవ చేయాలనే సంకల్పం.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచే మంచి మనసు.. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టాలనే మానవత్వం.. ఇవే ఒక వ్యక్తికి ప్రజల్లో ప్రత్యేక గుర్తింపును తీసుకొస్తాయి. తండ్రి చూపిన సేవామార్గంలో పయనిస్తూ, తనవంతుగా సమాజానికి సేవలందిస్తున్న రామన్నగారి మణికంఠ గౌడ్ స్థానికంగా సేవాభావానికి ప్రతీకగా నిలుస్తున్నారు. ఒకప్పుడు చిలుక రాజు.. ఇప్పుడు మణికంఠ గౌడ్.. సేవలో తండ్రిని మించిన తనయుడు” అంటూ ఆయన సేవలను తెలిసినవారు అభివర్ణిస్తున్నారు.

#### తండ్రి అడుగుజాడల్లో తనయుడి ప్రస్థానం

కీర్తిశేషులు రామన్నగారి రాజేశ్వర్ గౌడ్ (చిలుక రాజు), మాజీ సర్పంచ్‌గా ప్రజలకు అందించిన సేవలు స్థానికులకు సుపరిచితం. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, అవసరమైన సమయంలో అండగా నిలిచే వ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారు. తండ్రి నుంచి అందిపుచ్చుకున్న సేవాభావాన్ని రామన్నగారి మణికంఠ గౌడ్ కూడా కొనసాగిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.
అమెరికాలో ఎం.ఎస్. (యూఎస్ఏ) పూర్తి చేసిన మణికంఠ గౌడ్, మాజీ కౌన్సిలర్‌గా ప్రజాజీవితంలో అనుభవం సంపాదించారు. ఫిలాంత్రపిస్ట్‌గా సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి చూపుతూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు, సామాజిక సేవకు తనవంతు సహకారం అందిస్తున్నారు.

#### 41 రోజుల పాటు అన్నదానం.. మాలలోఉన్నవారికి లేని వారికీ భోజనం

మేడ్చల్‌లోని శ్రీశ్రీ గడిమైసమ్మ తల్లి దేవస్థానంలో భవానీ దీక్షల సందర్భంగా రామన్నగారి మణికంఠ గౌడ్ అన్నదాన కార్యక్రమానికి ప్రాధాన్యతనిచ్చారు. 2026 సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 21 వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో దీక్షలో ఉన్న భవానీ భక్తులతో పాటు, మాల ధరించని వారికి కూడా అన్నదానం అందించడం ప్రత్యేకంగా నిలిచింది.
అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకే కాకుండా, అక్కడికి వచ్చిన ఇతరులకు కూడా భోజనం అందించడం ద్వారా అన్నదానంలోని సమానత్వ భావనను చాటారు. ఆకలితో వచ్చినవారికి కడుపునిండా అన్నం పెట్టడం ద్వారా సేవకు కులమతాలు, ఆచార వ్యవహారాలు అడ్డుకావని, మానవత్వమే ముఖ్యమనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందించింది.
అన్నదానం మహాదానం అనే భావనకు అనుగుణంగా 41 రోజుల పాటు భోజన సదుపాయం కల్పించడం అభినందనీయమని స్థానికులు పేర్కొంటున్నారు.

#### ఆపదొస్తే అండగా.. అవసరమైతే ముందడుగు

మనిషి విలువ మాటల్లో కాదు.. అవసరమైన సమయంలో చేసే సాయంలో కనిపిస్తుంది. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, సాధ్యమైనంత సహాయం అందించడం, ప్రజల సమస్యల పట్ల స్పందించడం వంటి లక్షణాలే ఒక వ్యక్తికి ప్రజల్లో గౌరవాన్ని తీసుకొస్తాయి. ఆపదలో ఉన్నవారికి తనవంతు సహాయం అందించేందుకు ముందుండే వ్యక్తిగా రామన్నగారి మణికంఠ గౌడ్‌ను ఆయనకు పరిచయమైనవారు గుర్తుచేసుకుంటున్నారు. తండ్రి చిలుక రాజు ప్రజలకు అందించిన సేవలను స్ఫూర్తిగా తీసుకుని, అదే బాటలో తనయుడు ముందుకు సాగడం స్థానికంగా చర్చనీయాంశంగా నిలుస్తోంది.

#### భక్తి.. సేవ.. సమాజ శ్రేయస్సు

శ్రీశ్రీ గడిమైసమ్మ తల్లి దేవస్థానంలో 41 రోజుల భవానీ దీక్ష విరమణల సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకరించడంతో పాటు అన్నదానానికి ప్రాధాన్యత ఇవ్వడం మణికంఠ గౌడ్ సేవా దృక్పథాన్ని ప్రతిబింబిస్తోంది. భక్తులకు మాత్రమే కాకుండా, మాల ధరించని వారికి కూడా అన్నం అందించడం ద్వారా అందరినీ సమానంగా చూడాలనే మంచి సందేశాన్ని అందించారు.

#### సేవే నిజమైన గుర్తింపు

పదవులు, హోదాలు తాత్కాలికం.. ప్రజలకు చేసిన సేవ మాత్రం చిరకాలం గుర్తుండిపోతుంది. తండ్రి సంపాదించిన మంచి పేరును నిలబెట్టుకుంటూ, తనదైన శైలిలో సేవా కార్యక్రమాలకు తోడ్పడటం అభినందనీయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకప్పుడు చిలుక రాజు.. ఇప్పుడు రామన్నగారి మణికంఠ గౌడ్.. తరాలు మారినా సేవా మార్గం

# రైతు భూమికి రాజముద్ర భరోసా

### ఇందుకూరుపేటలో పాసుపుస్తకాల పంపిణీ పూర్తి



ఇందుకూరుపేట(ప్రశ్న న్యూస్) రైతుల భూమిపై హక్కులకు భరోసా కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చేపట్టిన ‘మీ భూమి-మీ హక్కు’ కార్యక్రమం అమలులో భాగంగా ఇందుకూరుపేట మండలంలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ పూర్తయింది. మండలంలోని 16 గ్రామాలకు మొత్తం 8,394 కొత్త పాసుపుస్తకాలు మంజూరయ్యాయి. బుధవారం గంగపట్నం, రాముడిపాళెం గ్రామాల్లో 1,251 మంది రైతులకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాసుపుస్తకాలను పంపిణీ చేశారు.

#### భూ హక్కులకు భరోసా

రైతుల భూమిపై హక్కులను ధ్రువీకరిస్తూ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను అందించాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ మేరకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో భూములకు సంబంధించి చోటుచేసుకున్న అవకతవకలను రీ-సర్వే ద్వారా సరిచేసి, భూముల వివరాలను ధ్రువీకరించే చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు రైతులకు తమ భూముల వివరాలను ధ్రువీకరించుకోవడంలో కీలకమని, భూ హక్కులకు సంబంధించి స్పష్టత ఉండటం అవసరమని ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రీ-సర్వే ప్రక్రియతో పాటు పాసుపుస్తకాల పంపిణీని మండలంలో పూర్తి చేసినట్లు వెల్లడించారు.

#### రైతు సంక్షేమమే లక్ష్యం

రైతులందరూ సుభిక్షంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా వరుణ యాగాలు నిర్వహించినట్లు తెలిపారు. గత కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండటంపై సంతోషం వ్యక్తం చేశారు.గత సీజన్‌లో మంచి దిగుబడులు రావడంతో రైతులకు మెరుగైన ఆదాయం లభించిందని గుర్తుచేశారు. ప్రస్తుత సీజన్‌లోనూ సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు ఆశాజనకంగా పండాలని ఆకాంక్షించారు. రైతులకు మంచి దిగుబడులతో పాటు మెరుగైన ఆదాయం లభించాలని పేర్కొన్నారు.

# దర్శి తాగునీటి కష్టాలకు చెక్

### పులిపాడు చెరువు విస్తరణతో ఇంటింటికీ

### తాగునీరు: డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



దర్శి(ప్రశ్న న్యూస్) పట్టణ ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కీలక అడుగు పడింది. రూ.120 కోట్ల వ్యయంతో అమృత్ 2.0 పథకం పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. దర్శి టీడీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ యువ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ తదితరులు ఈ పనులను ప్రారంభించారు. ఈ పథకం ద్వారా సుమారు 8 వేల ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేసి ఇంటింటికీ తాగునీరు అందించనున్నట్లు డాక్టర్ లక్ష్మి తెలిపారు.

#### తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ.. దర్శి పట్టణంలోని వివిధ వార్డుల్లో ప్రజలు తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను స్వయంగా గమనించానని తెలిపారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రూ.120 కోట్ల అమృత్ 2.0 పథకాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ సహకారంతో ఈ పథకం ప్రారంభమైందన్నారు.
పులిపాడు చెరువు విస్తరణ పనులతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే పట్టణంలో తాగునీటి సరఫరా మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అమృత్ 2.0 పనులను ప్రారంభించిందన్నారు.

#### అభివృద్ధిని కొనసాగించేందుకు సహకరించండి

దర్శి పట్టణ రూపురేఖలు మారేలా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడమే లక్ష్యమని డాక్టర్ లక్ష్మి తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో, ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు.

#### పలువురు ప్రముఖుల హాజరు

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, డాక్టర్ కడియాల లలిత్ సాగర్, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి ఏఎంసీ చైర్మన్ దారం నాగమయ్యణి-సుబ్బారావు, జిల్లా మున్సిపల్ ఈఈ సంజయ్ శ్రీనివాస్, డీఈ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ కె. అర్జున్‌రావు, ఏఈ బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు. దర్శి మండల, పట్టణ టీడీపీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, పుల్లలచెరువు సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ తలారి కోటయ్య, నారపుశెట్టి మధు, వెలిగొండారెడ్డి, కౌన్సిలర్లు నక్కా రంగా, చంద్ర, వి.సి. రెడ్డి, ఉగ్గు పవన్, జూపల్లి కోటేశ్వరరావు, యాదగిరి వాసు, కర్ణ శ్రీను, పటాన్ సుభాని, ఇతర టీడీపీ నాయకులు, కూటమి శ్రేణులు, ప్రజలు హాజరయ్యారు.

# జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా బాధ్యతలు స్వీకరించిన ప్రసూనాంబ

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ప్రసూనాంబ**



జగిత్యాల (ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా ఎన్. ప్రసూనాంబ బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమెను అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా నియమించారు. గతంలో ఆమె తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) కార్యాలయంలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించారు. అక్కడి నుంచి బదిలీ పై జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్‌గా నియమితులై బుధవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా ఎన్. ప్రసూనాంబ బుధవారం బాధ్యతలు స్వీకరించగా మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ను కలిసి పుష్ప గుచ్ఛం అందించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బాధ్యతలను సమర్ధవంతంగా ప్రజలతో మమేకమై నిర్వర్తించాలని జిల్లా కు రాష్ట్ర స్థాయి లో గుర్తింపు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్, కలెక్టరేట్ ఏవో కిషన్ , కలెక్టరేట్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# ఉత్తరప్రదేశ్‌కు చెందిన పవన్ సింగ్ దారుణ హత్య

**ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు**

**క్లూస్ టీమ్‌తో ఆధారాల సేకరణ**

**మృతదేహానికి పంచనామా, పోస్టుమార్టం కోసం తరలింపు.**



ఎల్లారెడ్డిపేట(ప్రశ్న న్యూస్) రాచర్ల గొల్లపల్లి గ్రామంలో హత్య ఘటన కలకలం రేపింది. గ్రామంలో ఓ వ్యక్తి హత్యకు గురికావడంతో స్థానికంగా ఆందోళన నెలకొంది. మృతుడిని ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పవన్ సింగ్‌గా పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఓ. వెంకటేష్, ఎస్సై ఎన్. రమేష్ గౌడ్ వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించారు. హత్య జరిగిన తీరుపై ప్రాథమికంగా ఆరా తీశారు. అనంతరం పోలీసుల సమక్షంలో మృతదేహానికి పంచనామా నిర్వహించే ప్రక్రియ చేపట్టారు.

### క్లూస్ టీమ్‌తో ఆధారాల సేకరణ

హత్యకు సంబంధించిన వాస్తవాలను వెలికితీసేందుకు పోలీసులు క్లూస్ టీమ్‌ను రంగంలోకి దించారు. ఘటనాస్థలంలో లభించిన ఆధారాలను సేకరించే పనిని చేపట్టారు. హత్యకు దారితీసిన పరిస్థితులు, నిందితుల వివరాలు, ఘటనకు సంబంధించిన ఇతర అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసే ప్రక్రియను ఎల్లారెడ్డిపేట పోలీసులు చేపట్టారు. పోస్టుమార్టం నివేదిక, ఘటనాస్థలంలో సేకరించిన ఆధారాలు, ఇతర విచారణ వివరాల ఆధారంగా మరిన్ని విషయాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

### పవన్ సింగ్ మృతి వెనుక ఉన్న కారణాలు ఏమిటి..?

ఈ ఘటనలో ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. పలు అంశాలపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడికానున్నాయి.

# అధికార పక్షమైనా.. ప్రతిపక్షమైనా అభివృద్ధిలో వివక్ష లేదు

**ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయాలకు తావులేదు..**

**అర్హతే ప్రామాణికం రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )అధికార పక్షమైనా.. ప్రతిపక్షమైనా అభివృద్ధిలో వివక్ష లేదని ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయాలకు తావులేదని అర్హతే ప్రామాణికం అనిరాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారంలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి రాష్ట్ర పరిశ్రమలు ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు వందల కోట్ల రూపాయలు ఉన్నప్పటికీ, పేదలు నివసించే ప్రాంతాల్లోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. నగరంలో జీవనోపాధి పొందుతున్న పేదలను దూర ప్రాంతాలకు తరలించి వారి ఉపాధికి ఇబ్బందులు కలిగించే విధానానికి స్వస్తి పలుకుతున్నామని తెలిపారు.క్యూర్ పరిధిలో మొదటి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని, 23 నియోజకవర్గాల్లో పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేశామని వెల్లడించారు. ఇప్పటికే ఆరు చోట్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశామని వివరించారు. మేడ్చల్ నియోజకవర్గంలో తొలి విడతగా 480 మంది లబ్ధిదారులను పారదర్శకమైన బహిరంగ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు.ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ఇప్పటికే సొంత ఇల్లు ఉన్నవారిని గుర్తించి, అర్హతలను ధ్రువీకరించిన అనంతరం పారదర్శకంగా డ్రా నిర్వహించామని చెప్పారు. ఎంపికైన వారిలో స్థానికంగా నివసించే అర్హులనే నిర్ధారించి ఇళ్లు కేటాయిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 2.20 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని వెల్లడించారు. త్వరలో రెండవ విడత ఇందిరమ్మ టవర్స్ కోసం మరోసారి దరఖాస్తులు తీసుకుంటామన్నారు. ఇందిరమ్మ టవర్స్‌లో ఎంపికైన లబ్ధిదారులకు కేవలం కేటాయింపు పత్రాలు ఇచ్చి సరిపెట్టబోమని, ఎలాంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా పూర్తి హక్కులతో ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసి అందిస్తామని మంత్రి ప్రకటించారు. ప్రతి అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన భూమిలో వాటాను కూడా రిజిస్ట్రేషన్‌లో పొందుపరుస్తామని తెలిపారు. వచ్చే బతుకమ్మ పండుగ నాటికి తొలి విడత లబ్ధిదారులకు ఇళ్లను పూర్తి చేసి, వారి చేతుల మీదుగా తాళాలు అందించాలన్నదే తమ లక్ష్యమని మంత్రి వెల్లడించారు. తొలి విడతలో అవకాశం దక్కని అర్హులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, తదుపరి విడతల్లో కొత్త దరఖాస్తుదారులతో సహా అర్హులందరినీ పరిశీలిస్తామని తెలిపారు.గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడంతో పాటు, ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని చెప్పారు. ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి, సమీప ప్రాంతాల్లోని అర్హులైన పేదలకు నిబంధనల ప్రకారం కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ఉన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కోసం సుమారు 440 కోట్ల రూపాయిలు ఖర్చు చేశామని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం మంత్రుల చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులను మంత్రుల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేసారు. కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ మార్కెటింగ్ ఛైర్మన్ నర్సింహులు యాదవ్, జిల్లా గ్రంధాలయ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ శాఖ ఎండీ వి.పి.గౌతమ్, కలెక్టర్ మనూచౌదరి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో లబ్ధిదారులు స్నేహ, శివకుమారి, రెహ్మతి తదితరులు మాట్లాడి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని, ప్రభుత్వ పనితీరును ప్రశంసించారు. అనంతరం ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపులు జరిగాయి

# "3"వేల కోసం పోతే, చెరసాల పాలైయ్యిండు.

**గంజాయి వ్యాపారానికి గోల్డెన్ రూట్ అనుకుంటే.. జైలుకు షార్ట్‌కట్ అయింది**

**35 కిలోల గంజాయితో పట్టుబడ్డ ముగ్గుర్నీ అరెస్ట్ చేసిన కార్ఖాన పోలీసులు.**




కంటోన్మెంట్(ప్రశ్న న్యూస్) దేశంలో యువత పెడదారిన పడుతుంది.వివిధ రకాల మత్తు పదార్థాలకు దగ్గరై జీవితాన్ని అతలాకుతలం చేసుకుంటుంది.విద్యార్థి దశలోనే చెడు అలవాట్లుకు బానిసలుగా మారుతున్నారు.మరో విషయం ఏమిటంటే చదువు సంధ్యలు పక్కకు పెట్టి అడ్డదారిలో పయనిస్తూ చెడు వ్యసనాలకు దగ్గరై కుటుంబానికి దూరమై, జీవితాన్ని కోల్పోతున్నారు. మరి ముఖ్యంగా బస్తీలు,
పాష్ కాలనీల్లో సైతం వదలని గలీజ్ మత్తు పదార్థాలు.మత్తుతో జీవితాన్ని చిత్తు చేసుకుంటూ కుటుంబ సభ్యులకు గుదిబండాలా మారుతున్నారు.ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న కేజేఆర్ గార్డెన్స్ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ఎస్ఓటి,కార్ఖాన పోలీసులు.గంజాయి వినియోగం,అక్రమ సాగు, రవాణా,విక్రయాలు వ్యక్తుల జీవితాలకే కాకుండా కుటుంబాలు,యువత, సమాజం,దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపిస్తుంది.ముఖ్యంగా మత్తు పదార్థాలు వినియోగించడం వల్ల ఆరోగ్యం,విద్య,ప్రజా భద్రతకు సంబంధించిన సమస్యలు తలెత్తే అవకాశం లేకపోలేదు. యువత దేశ భవిష్యత్తుకు పునాదులు.చదువులు, ఉద్యోగాలు,నైపుణ్యాలు, ఆవిష్కరణలతో జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాల్సిన సమయంలో కొందరు గంజాయి వంటి మత్తు పదార్థాలకు ఆకర్షితులవడం ఆందోళన కలిగిస్తోందని పోలీసులు పేర్కొన్నారు.సరదాగా మొదలయ్యే అలవాటు కొందరి జీవితాల్లో క్రమంగా సమస్యగా మారుతోంది. స్నేహితుల ఒత్తిడి,కొత్త అనుభవాలపై ఆసక్తి,ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలనే కోరిక,సోషల్ మీడియాలో కనిపించే ప్రభావాలు వంటి అనేక కారణాలు యువత గంజాయి వైపు మొగ్గుచూపడానికి దోహదపడుతున్నాయని మల్కాజిగిరి డిసిపి సిహెచ్ శ్రీధర్ తెలిపారు.

### పోలీసులకు చిక్కిన గంజాయి ముఠా:

కార్ఖాన పోలీస్ స్టేషన్ పరిధిలో స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్ఓటీ), కార్ఖాన పోలీసులు నిర్వహించిన నాక బంధీ తనిఖీల్లో ముగ్గురు గంజాయి పెడ్లర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు.
కార్ఖానలోని కేజేఆర్ గార్డెన్స్ ఎదురుగా పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో పోలీసులను గమనించిన ముగ్గురు అనుమానితులు అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయి అక్రమ రవాణా వ్యవహారం వెలుగులోకి వచ్చింది.నిందితుల నుంచి 35 కిలోల గంజాయి,ఐదు మొబైల్ ఫోన్లు,6,200/ నగదును స్వాధీనం చేసుకున్నారు.నిందితులు విశాఖపట్నానికి చెందిన రవీందర్ అనే వ్యక్తి నుంచి భారీ మొత్తంలో గంజాయిని కొనుగోలు చేసి సికింద్రాబాద్‌లోని జేబీఎస్ మీదుగా మహారాష్ట్రకు తరలించి అక్కడ విక్రయిస్తూ భారీగా లాభాలు సొంతం చేసుకుంటున్నారని విచారణలో వెల్లడైంది.ఈ కేసులో సప్లయర్ రవీందర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

### మహారాష్ట్రకు చెందిన నిందితులు:

పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులను మహారాష్ట్రకు చెందిన సంపత్ లహు డోలారే (60),దుర్కాస్ దిగంబర్ డోలారే (24), గైక్వాడ్ దినేష్ విద్యాసాగర్ (24)గా గుర్తించారు.వీరిలో సంపత్ లహు డోలారే గంజాయి విక్రయాల్లో పాల్గొంటుండగా,దుర్కాస్ దిగంబర్ డోలారే కూలీగా, గైక్వాడ్ దినేష్ విద్యాసాగర్ స్వీట్ హౌస్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నారు.మొదటి, మూడో నిందితులు గంజాయి విక్రయాల్లో అలవాటుపడిన వారిగా గుర్తించామని మల్కాజిగిరి జోన్ డీసీపి శ్రీధర్ విలేకరుల సమావేశంలో తెలిపారు.ఈ ఆపరేషన్ లో ఎస్ఓటీ డీసీపీ మనోహర్,అల్వాల్ ఏసీపీ రమేష్,ఎస్ఓటీ ఏసీపీ రాజశేఖర్,కార్ఖాన డీఐ ఎలక్షన్ రెడ్డి,ఎస్ఓటీ ఎస్ఐలు

# యంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో ఘనంగా ఆయుధపూజ





నాంపల్లి (ప్రశ్న న్యూస్) విజయదశమి సందర్భంగా అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా యంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి అరబిందో బ్లాక్ లోని సెంట్రల్ ల్యాబరేటరీలో సాంప్రదాయబద్ధంగా ఆయుధ పూజాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆస్పత్రి డైరక్టర్ డా. సదాశివుడు మాట్లాడుతు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఉద్యోగుల కృషి అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడి. డా. రాధిక, డాక్టర్ వెన్నల, డాక్టర్ శిల్పారెడ్డి, డాక్టర్ విశాల్, డాక్టర్ ఖలీల్, డాక్టర్ రెహెమాన్, చిలివేరి నాగరాజు, జి. పద్మ, శివ, వినోద్, అఖిల్, సుజాత, గీతాంగళి తదితరులు పాల్గోన్నారు.

# సచివాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు







సచివాలయం(ప్రశ్న న్యూస్) తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. పూలను పూజించి ప్రకృతిని ఆరాధించే సంస్కృతికి ప్రతిబింబమైన బతుకమ్మ వేడుకలు మహాలయ అమావాస్య రోజున సంప్రదాయబద్ధంగా ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకలు వివిధ రకాల పేర్లతో రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను భక్తిశ్రద్ధలతో పూజించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. బుధవారం నాడు రాష్ట్ర సచివాలయంలో సెక్రటేరియట్ ఉమెన్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో అత్యంత ఉత్సాహంగా పాల్గోన్న మహిళా ఉద్యోగులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సాంప్రదాయబద్ధంగా ఆడి పాడి సందడి చేశారు. మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ వేడుకలు రెండవ రోజు అటుకుల బతుకమ్మ, మూడవ రోజు ముద్దపప్పు బతుకమ్మ, నాల్గవ రోజు నానబియ్యం బతుకమ్మ, ఐదవ రోజు అట్ల బతుకమ్మ, ఆరవ రోజు అలిగిన బతుకమ్మ, ఏడవ రోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదవ రోజు వెన్నముద్దల బతుకమ్మ, తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మగా ఈ పూల పండుగ ప్రసిద్ధి చెందింది. బతుకమ్మ వేడుకలతో బుధవారం నాడు రాష్ట్ర సచివాలయంలో బతుకమ్మ పాటలతో మార్మోగింది.

# ఈరోజు ఈ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం



కీసర( ప్రశ్న న్యూస్) ఫీడర్ నిర్వహణ పనులు (పి ఎం ఐ ) కారణంగా ఈరోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కీసర విద్యుత్ శాఖ ఏ ఏ ఈ ఎస్. మురళీకృష్ణ తెలిపారు. కీసర సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ చీర్యాల్ లక్ష్మి ఫీడర్‌పై నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కారణంగా కుందన్‌పల్లి గ్రామం, వర్ధన స్కూల్, వికలాంగుల కాలనీ, గోదుమకుంట గ్రామం, ఏజీఎల్ సర్వీసెస్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు.

# 'ఐస్' సిరీస్ రివ్యూ!

మొదటి నుంచి కూడా 'సోనీ లివ్' క్వాలిటీ విషయంలో రాజీలేని భారీ వెబ్ సిరీస్ లను అందిస్తూ వస్తోంది. బలమైన కథాకథనాలకు ప్రాధాన్యతనిస్తూ, విలక్షణమైన కంటెంట్ ను అందిస్తూ వెళుతోంది. అలా 'సోనీ లివ్' మరో ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చింది .. ఆ సిరీస్ పేరే 'ఐస్'. నిఖిలా విమల్ ప్రధానమైన పాత్రను పోషించిన ఈ థ్రిల్లర్ సిరీస్ ను , 7 ఎపిసోడ్స్ గా రూపొందించారు. మొత్తంగా చూసుకుంటే ఒక్కో ఎపిసోడ్ నిడివి 50 నిమిషాల వరకూ ఉంది. ఈ నెల 8వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతున్న ఈ సిరీస్, తెలుగులోనూ అందుబాటులో ఉంది.ప్రేమ పేరుతో అమ్మాయిలను వలలో వేసుకోవడం .. ఏ మాత్రం తేడా వచ్చినా వాళ్ల ప్రాణాలు తీయడం సర్వ సాధారణమైపోయింది. పెళ్లి తరువాత భర్త వేధింపులను భరిస్తూ వస్తున్న అమ్మాయిల సంఖ్య పెరుగుతోంది. ప్రేమించిన అమ్మాయిని .. తమని నమ్మి పెళ్లి చేసుకున్న అమ్మాయిని హత్య చేయడానికి ఏ మాత్రం వెనుకాడని అబ్బాయిల ధోరణి అందరిలో భయాన్ని కలిగిస్తున్నాయి. ఇలాంటి నేరాలను అరికట్టడానికి .. అబ్బాయిలను కౌన్సిలింగ్ ద్వారా మార్చడానికి 'విద్య' ఒక సాఫ్ట్ వేర్ ను కనిపెడుతుంది. జరగబోయే నేరాలను ముందుగానే పసిగట్టే ఆ సాఫ్ట్ వేర్ పేరే 'ఐస్'. అమ్మాయిలపై అబ్బాయిల దాడులను ముందుగానే పసిగట్టి, వాళ్లలో నేర ప్రవృత్తికి అడ్డుకట్ట వేయడమే ఈ సాఫ్ట్ వేర్ లక్ష్యం. పాజిటివ్ పోలీసింగ్ ద్వారా పోలీస్ డిపార్టుమెంట్ ఈ సాఫ్ట్ వేర్ ను ఉపయోగించడానికి సహకరించవలసినదిగా ఆమె పోలీస్ డిపార్టుమెంట్ ను కోరుతుంది. దాంతో డిపార్టుమెంట్ వారు ఆ వైపు నుంచి ఆమెకి పోలీస్ ఆఫీసర్ 'టీనా'ను .. కానిస్టేబుల్ 'జస్టిన్'ను ఇస్తారు. మానసిక వైద్య నిపుణురాలు అయిన 'అయేషా' ( నిఖిలా విమల్) కూడా తన అసిస్టెంట్ 'తన్వీ'తో ఈ టీమ్ లోకి వస్తుంది.ఈ సాఫ్ట్ వేర్ ఎలా పనిచేస్తుందనేది తెలుకోవడం కోసం ట్రైల్స్ మొదలుపెడతారు. ప్రేమ పేరుతో హీరోయిన్ 'రీతూ' వెంటపడుతున్న 'మిలన్' పై .. 'వర్ష'ను వేధిస్తున్న 'హేమంత్'పై .. 'జెస్సీ'ను టార్చర్ చేస్తున్న 'ప్రియన్'పై టెస్ట్ చేయడం మొదలుపెడతారు. ఈ కేసుల విషయంలో వాళ్లు సతమతమవుతూ ఉండగానే, తెరపైకి ఐఏఎస్ ఆఫీసర్ 'సాజిన్' (దేవ్ మోహన్) అతని భార్య 'శోభిత'కి సంబంధించిన కేసు తెరపైకి వస్తుంది. ఈ కేసులను 'ఐస్' టీమ్ ఎలా సాల్వ్ చేస్తుంది? ఆ ప్రయత్నంలో వాళ్లకి ఎదురయ్యే సవాళ్లు ఎలాంటివి? అనేది మిగతా కథ.పరిచయం .. స్నేహం .. ఆకర్షణ .. ప్రేమ .. ఇలా అంచలంచెలుగా యువత ప్రేమ వరకూ వెళుతోంది. ఒకరికొకరు దగ్గరవుతున్నా కొద్దీ ఒకరి స్వభావం ఒకరికి అర్థమవుతూ ఉంటుంది. అబ్బాయిల మెంటాలిటీ తమకి సెట్ కాదని అమ్మాయిలు భావించి వాళ్లని దూరం పెట్టే ఆలోచన చేయడంతోనే అసలు సమస్య మొదలవుతోంది. అదే వాళ్ల ప్రాణాల మీదికి



తెస్తోంది. అబ్బాయిలను నేరస్థులను చేస్తోంది. అసహనం .. కోపం .. ద్వేషం .. దురలవాట్లు అబ్బాయిలను నేరస్థులుగా నిలబెడుతున్నాయి. ఇక పెళ్లి తరువాత కూడా చాలామంది అమ్మాయిలు .. అబ్బాయిలు కలిసి ఉండలేకపోతున్నారు. ఉన్నతమైన పదలవులలో ఉన్నవారు సైతం ఇందుకు మినహాయింపు కాకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. అలాంటి వాళ్లను మార్చడానికి ప్రయత్నించే ఒక సాఫ్ట్ వేర్ చుట్టూ అల్లుకున్న కథ ఇది. ప్రమాదం జరగడానికి ముందే అటు బాధితులను .. ఇటు పోలీస్ శాఖను అప్రమత్తం చేసే ఒక ఆలోచనతో కూడిన ఈ కాన్సెప్ట్ ఆలోచింపజేస్తుంది. ప్రస్తుతం కాలంలో ఈ తరహా టెక్నాలజీ అవసరం అనిపిస్తుంది. ఐదు జంటల చుట్టూ దర్శకుడు ఈ కథను అల్లుకుంటూ వెళ్లాడు. ఈ ఐదు జంటల చుట్టూ చోటుచేసుకునే అనూహ్యమైన సంఘటనల సమాహారమే ఈ సిరీస్. మారుతున్న పరిస్థితులు .. మనుషులు .. స్వభావాలపై పూర్తిగా ఫోకస్ చేస్తూ, నేరాలు జరగడానికి కారణాలు .. జరగకుండా చూడటానికి అవసరమైన విధానాలను ఆవిష్కరిస్తూ వెళ్లారు. విద్య .. అయేషా .. రీతూ .. ఈ మూడు పాత్రలు చాలా ప్రధానమైనవిగా తెరపైకి తీసుకుని వచ్చారు.కానీ ఈ మూడు పాత్రలు చాలా నిదానంగా .. నీరసంగా కదులుతూ ఉంటాయి. టీమ్ యాక్టివ్ గా లేకుండా డల్ గా ఉండటమే ఈ సిరీస్ లో ప్రధానమైన లోపంగా కనిపిస్తుంది. 'ఐస్'కి సంబంధించిన సాఫ్ట్ వేర్ ఎలా పనిచేస్తుందని అర్థమయ్యేలా చెప్పగలిగారు. కానీ దాని చుట్టూ ఉత్కంఠను రేకెత్తించే సన్నివేశాలను డిజైన్ చేసుకోలేకపోయారు. ఇక దర్శకుడు ఈ కేసులన్నింటికీ సంబంధించిన పరిష్కారాలు చివరి ఎపిసోడ్లోనే చెప్పాలని నిర్ణయించుకున్నాడు. అందువలన 6 ఎపిసోడ్స్ లోని అంశాలు కాస్త ఓపికగా భరించవలసి ఉంటుంది. చివరి ఎపిసోడ్ .. ముందున్న ఎపిసోడ్స్ బలాన్ని పెంచేదిలా ఉండటం కాస్త ఊరట కలిగిస్తుంది.ఆరంభంలో కాస్త యాక్టివ్ గా అనిపించిన విద్య .. రీతూ పాత్రలు ఆ వెంటనే నీరసించిపోతాయి. ఇక పోలీస్ ఆఫీసర్ టీనా పాత్రను కూడా సరిగ్గా డిజైన్ చేసినట్టుగా అనిపించదు. పాత్రలకు తగిన ఆర్టిస్టులను ఎంపిక చేసుకోగలిగారు. వాళ్లంతా కూడా చాలా సహజంగా చేశారు. గౌతమ్ శంకర్ ఫొటోగ్రఫీ .. రంజిన్ రాజ్ నేపథ్య సంగీతం .. అభిలాష్ బాలచంద్రన్ ఎడిటింగ్ ఫరవాలేదు. నిర్మాణం పరంగా .. క్వాలిటీ పరంగా ఈ సిరీస్ కి వంకబెట్టవలసిన పనిలేదు. చెప్పదలచుకున్న పాయింట్ కూడా బాగుంది. కానీ ఆ విషయాన్ని నిదానంగా .. నింపాదిగా .. తాపీగా చెప్పుకుంటూ వెళ్లడమే అసంతృప్తిని కలిగిస్తుంది.

## మాతృత్వంపై శోభిత ఆసక్తికర వ్యాఖ్యలు!



ప్రముఖ నటి శోభితా ధూళిపాళ తన వ్యక్తిగత జీవితం, మాతృత్వంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు ఎప్పటినుంచో ఒక కుటుంబాన్ని ప్రారంభించాలని కోరిక ఉందని, అయితే అలాంటివి జరగాల్సిన సమయంలో వాటంతట అవే జరుగుతాయని ఆమె అన్నారు. గతేడాది డిసెంబర్‌లో టాలీవుడ్ నటుడు నాగచైతన్యను వివాహం చేసుకున్న శోభిత, పెళ్లి తర్వాత తొలిసారి ఫ్యామిలీ ప్లానింగ్‌పై స్పందించారు.ఇటీవల 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాలు పంచుకున్నారు. "నాకు ఎప్పటినుంచో ఒక కుటుంబం కావాలని ఉంది. కానీ దాని గురించి ఎక్కువగా ఆలోచించి ఒత్తిడి పెంచుకోను. ఎందుకంటే కొన్ని విషయాలు జరగాల్సిన సమయంలో వాటంతట అవే జరుగుతాయి" అని శోభిత వివరించారు. తన తొలి చిత్రం 'రామన్ రాఘవ్ 2.0' తో పరిశ్రమలోకి అడుగుపెట్టి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆమె తన కెరీర్, వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడారు.గతంలో తాను నటులను ఎప్పటికీ డేట్ చేయనని చెప్పిన విషయాన్ని కూడా శోభిత గుర్తుచేసుకున్నారు. అప్పట్లో తన చుట్టూ ఉన్న పరిస్థితులు, ఉదాహరణలను చూసి ఒక మూస అభిప్రాయానికి వచ్చానని, అందుకే అలా చెప్పానని అన్నారు. అయితే ఇప్పుడు తన ఆలోచనా ధోరణి పూర్తిగా మారిందని, కాలంతో పాటు అభిప్రాయాలు మార్చుకోవడంలో తనకు ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. తన వ్యక్తిగత జీవితంపై ప్రజలు, మీడియాలో జరిగే చర్చల గురించి మాట్లాడుతూ.. "సమాజం అభిప్రాయాలు వాతావరణం లాంటివి. అవి నిరంతరం మారుతూ ఉంటాయి. వాటిని పట్టించుకోకుండా మన పని మనం చేసుకుంటూ ప్రశాంతంగా ఉండటమే ముఖ్యం" అని శోభిత పేర్కొన్నారు. ఆమె వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## ప్రభాస్ 'రాజాసాబ్' సినిమా ఫెయిల్ కావడానికి కారణం ఇదే: నిర్మాత విశ్వప్రసాద్




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా తెరకెక్కిన హారర్ కామెడీ 'ది రాజా సాబ్' బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయం సాధించకపోవడానికి గల కారణాలను ఆ చిత్ర నిర్మాత, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ స్వయంగా వెల్లడించారు. సంక్రాంతి వంటి పోటీ ఉన్న సీజన్‌లో సినిమాను విడుదల చేయడమే తాము చేసిన ప్రాథమిక తప్పిదమని ఆయన స్పష్టం చేశారు.హైదరాబాద్‌లో నిర్వహించిన 'గరివిడి లక్ష్మి' ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా 'ది రాజా సాబ్' ఫలితంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. "సంక్రాంతి సీజన్‌లో రావడం మేము చేసిన ప్రాథమిక తప్పు. వేరే సమయంలో విడుదలై ఉంటే ఫలితం కచ్చితంగా మరోలా ఉండేది" అని ఆయన అన్నారు.కేవలం విడుదల సమయమే కాకుండా మరికొన్ని కారణాలు కూడా సినిమా ఫలితాన్ని ప్రభావితం చేశాయని విశ్వప్రసాద్ అంగీకరించారు. "సినిమా విడుదల రోజు ప్రీమియర్ షోలు ఆలస్యమయ్యాయి. దానికి తోడు, మేము టికెట్ ధరలు కూడా పెంచాలని ప్రయత్నించాం. మా సంస్థ తరఫున టికెట్ ధరలు పెంచడం అదే మొదటిసారి. ఆ నిర్ణయం తీసుకుని ఉండాల్సింది కాదు. దీనివల్ల ప్రేక్షకులు ఇబ్బంది పడ్డారు, నిరాశకు గురయ్యారు" అని ఆయన వివరించారు.మారుతి దర్శకత్వంలో రూ. 400 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మించిన 'ది రాజా సాబ్', ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 208 కోట్లు మాత్రమే వసూలు చేసింది. ప్రభాస్ స్టార్‌డమ్ ఉన్నప్పటికీ, ఈ చిత్రం ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. అయితే, ఈ సినిమా ఫలితం గురించి మాట్లాడటం తన మూడ్‌ను పాడుచేయలేదని, తాము ప్రస్తుతం సంతోషంగానే ఉన్నామని విశ్వప్రసాద్ పేర్కొన్నారు.

## ఈ రుక్మిణి మహా కోపిష్టి!



కృష్ణ గణితశాస్త్ర ఉపాధ్యాయుడు. మంచి రచయిత కూడా. అయితే ఆయన రాసే కథలన్నీ భార్య రుక్మిణి పేరుతో ప్రచురితమవుతుంటాయి. ఈ ప్రేమకథలకు పాఠకుల్లో మంచి ఆదరణ లభిస్తుంటుంది. అయితే భార్య పేరుమీద కృష్ణ కథలు ఎందుకు రాస్తున్నాడు? రుక్మిణి పాత్ర వెనకున్న రహస్యమేమిటి? ఈ వివరాలు తెలుసుకోవాలంటే 'అలియాస్ రుక్మిణి' సినిమా చూడాల్సిందే అంటున్నారు మేకర్స్. నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవపోత్ దర్శకత్వం వహిస్తున్నారు.అగ్ర హీరో నాని సమర్పణలో ఆయన సోదరి దీప్తి గంటా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో బాలీవుడ్ నటి ఆఫియా సయ్యద్ కథానాయికగా నటిస్తున్నది. స్కూల్ టీచర్ రుక్మిణి పాత్రలో ఆమెను పరిచయం చేస్తూ ఫస్ట్ గ్లింప్స్‌ని విడుదల చేశారు. ఈ వీడియోలో విద్యార్థులు ఆమెను హిట్లర్, హోంవర్క్ పోలీస్ వంటి పేర్లతో పిలుస్తుంటారు. చక్కటి అందం, అంతకుమించిన కోపిష్టి స్వభావంతో రుక్మిణి పాత్రను ప్రజెంట్ చేశారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుందని, ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇదని మేకర్స్ తెలిపారు.

## ఎమోషనల్ లవ్‌స్టోరీకి సిద్ధం



గత రెండేళ్లుగా వరుస యాక్షన్ సినిమాలతో సందడి చేస్తూ వచ్చారు హీరో నాని. దసరా, హిట్ 3, ది ప్యారడైజ్.. ఇలా మాస్ యాక్షన్ మోడ్‌లో ఆయన చేసిన సినిమాలన్నీ భారీ విజయాలను అందుకున్నాయి. ప్రస్తుతం సుజీత్ దర్శకత్వంలో నటిస్తున్న 'బ్లడీరోమియో' సినిమాలో కూడా కొంతమేర యాక్షన్ ఉంటుందని తెలుస్తున్నది. ఇదిలావుంటే.. ఈ సినిమా తర్వాత నుంచి కథల ఎంపిక విషయంలో నాని పంథా మార్చనున్నారట. యాక్షన్ కథలను పక్కనపెట్టి, మనసుల్ని మెలిపెట్టే భావోద్వేగపూరితమైన కథాంశాలపై ఆయన దృష్టిసారించనున్నట్టు అంతరంగిక వర్గాల భోగట్ట. ఈ క్రమంలోనే మధురమైన జ్ఞాపకాలను, చెప్పుకోలేని భావాలను తెరపై అద్భుతంగా ఆవిష్కరించే తమిళ దర్శకుడు ప్రేమ్ కుమార్ దర్శకత్వంలో ఆయన ఓ ఎమోషనల్ ప్రేమకథలో నటించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. 96, సత్యం సుందరం చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువయ్యారు డైరెక్టర్ ప్రేమ్ కుమార్. త్వరలో ఆయన నానితో చేయబోతున్న సినిమా కూడా భావోద్వేగాల మేళవింపుగా ఉంటుందని సమాచారం. ఈ ఎమోషనల్ లవ్‌స్టోరీలో కథానాయిక పాత్ర కీలకమని టాక్. అందుకే ఆ పాత్ర కోసం చాలామంది కథానాయికలను పరిశీలించిన చిత్రబృందం చివరకు రుక్మిణి వసంత్‌ను ఖరారు చేసినట్లు తెలిసింది. ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ నిర్మించనున్న ఈ సినిమాకు సంబంధించిన అధికార ప్రకటన రావాల్సివుంది.

## 'గరివిడి లక్ష్మి' ఓ భావోద్వేగ ప్రయాణం



ఆంధ్రప్రదేశ్‌కి చెందిన ప్రముఖ జానపద గాయని గరివిడి లక్ష్మి జీవిత కథ ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'గరివిడి లక్ష్మి'. ఆనంది టైటిల్ రోల్‌ని పోషించారు. గౌరినాయుడు జమ్ము దర్శకుడు. పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదల కానున్నది. మంగళవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. 'ఇది మా సంస్థ నుంచి వస్తున్న కొత్త ప్రయత్నం. ఇప్పటివరకూ సినిమా చూసినవారంతా మంచి ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు. ఈ సినిమాను ఇప్పటివరకూ ఓ పదిహేనుసార్లు చూసుంటాను. ం

చూసిన ప్రతిసారీ అదే ఎమోషన్‌ని క్రియేట్ చేసింది. ఈ సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. అందుకే ఒకరోజు ముందే ప్రీమియర్లు వేస్తున్నాం. ప్రభాస్‌గారితో త్వరలో ఓ సినిమా చేయబోతున్నాం' అని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ తెలిపారు. సినిమా చూసినవారందరి కళ్లలో నీళ్లు చూసినప్పుడు ఈ కథ వారి హృదయాల్ని ఎంతగా కదిలించిందో అర్థమైందని, తన కెరీర్లోనే ఇది మోస్ట్ ఛాలెంజింగ్ క్యారెక్టర్ అని నటి ఆనంది చెప్పారు.

## విజయ్ దేవరకొండ 'రణబాలి' అడ్వాన్స్ బుకింగ్స్ షురూ.!

టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ, సెన్సేషనల్ హీరోయిన్ రష్మిక మందన్న జంటగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా విడుదల తేదీ సమీపిస్తున్న తరుణంలో చిత్ర యూనిట్ అభిమానులకు అదిరిపోయే అప్డేట్ అందించింది. తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రానికి సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్ అధికారికంగా ప్రారంభమయ్యాయి.టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. టాలెంటెడ్ డైరెక్టర్ రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా రాయలసీమ నేపథ్యంలో సాగే ఒక పవర్‌ఫుల్ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. ఇక ఈ చిత్రానికి ప్రముఖ సంగీత ద్వయం అజయ్ -- అతుల్ అదిరిపోయే మ్యూజిక్ అందిస్తుండగా, హాలీవుడ్ ప్రముఖ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ ఈ సినిమాలో ప్రతినాయకుడిగా నటిస్తుండటం విశేషం.ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలు, సింగిల్ స్క్రీన్‌లు మరియు మల్టీప్లెక్స్‌లలో రణబాలి అడ్వాన్స్ టికెట్ బుకింగ్స్ జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా తెలుగు వెర్షన్‌కు సంబంధించి ప్రీ-సేల్స్ ఊపందుకున్నాయి. ఫస్ట్ డే ఫస్ట్ షో కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు, ఓవర్సీస్‌లో తొలి రోజు కేవలం తెలుగు వెర్షన్ మాత్రమే గ్రాండ్‌గా విడుదలవుతుండగా, ఇతర భాషల డబ్బింగ్ వెర్షన్లు అక్టోబర్ 23న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సమాచారం. సినిమాకు హైప్ విపరీతంగా ఉండటంతో బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్స్ రాబట్టే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అక్టోబర్ 16, 2026న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.



## భద్రకాళి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా
# కల్లూరి పవన్ గంగపుత్ర నియామకం

**- అభినందించిన -టిజిఎస్ రాష్ట కార్యదర్శి**

**టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర**



హనుమకొండ(ప్రశ్న న్యూస్) వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన గంగపుత్ర సామాజిక వర్గ నాయకుడు తెలంగాణ ఉద్యమకారుడు కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకుడు కల్లూరి పవన్ గంగపుత్ర వరంగల్ శ్రీ భద్రకాళి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా నియమితులైన సందర్భంగా తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుతూ గంగపుత్ర సామాజిక వర్గానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు బీసీ నాయకుడు కల్లూరి పవన్ గంగపుత్రకు భద్రకాళి దేవస్థానం పాలక మండలిలో సభ్యుడిగా అవకాశం కల్పించేందుకు సహకరించిన వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డికి తెలంగాణ గంగపుత్ర సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక సేవ పట్ల అంకితభావంతో పనిచేసే కల్లూరి పవన్ గంగపుత్రకు ఈ బాధ్యత దక్కడం గంగపుత్ర సామాజిక వర్గానికి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు భద్రకాళి దేవస్థానం అభివృద్ధికి పవన్ గంగపుత్ర తన వంతు కృషి చేయాలని భక్తులకు సకాలంలో అమ్మవారి దర్శనం కల్పించడంతో పాటు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధితో పాటు భక్తుల సౌకర్యాల మెరుగుదలకు కృషి చేస్తూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి మంచి పేరు సంపాదించాలని కల్లూరి పవన్ గంగపుత్రకు టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర శుభాకాంక్షలు తెలిపారు.

# నీలోఫర్ వైద్య బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు

**బాలుడికి విజయవంతంగా శస్త్రచికిత్స**

**వైద్య సేవలపై ప్రత్యేక అభినందనలు తెలిపిన పోతుగంటి నరేందర్**



కల్వకుర్తి (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రిలో అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడు శ్రీకృష్ణకు వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. సమయానికి స్పందించి మెరుగైన వైద్యం అందించి బాలుడి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడేందుకు కృషి చేసిన నీలోఫర్ ఆసుపత్రి యాజమాన్యానికి, వైద్య బృందానికి నాయకులు పోతుగంటి నరేందర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కల్వకుర్తి ప్రాంతంలోని లింగాసన్ పల్లి గ్రామానికి చెందిన హుస్సేన్ కుమారుడు శ్రీకృష్ణ అనారోగ్యంతో బాధపడుతుండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న పోతుగంటి నరేందర్ బాలుడి ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి యాజమాన్యం, సూపరింటెండెంట్, ఆర్ఎంఓతో పాటు సంబంధిత వైద్యులతో మాట్లాడి, బాలుడికి త్వరితగతిన తగిన వైద్య సేవలు అందించాలని కోరారు. దీనిపై స్పందించిన ఆసుపత్రి వైద్య బృందం బాలుడు శ్రీకృష్ణకు అవసరమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. ప్రస్తుతం బాలుడు సురక్షితంగా ఉన్నాడని పోతుగంటి నరేందర్ తెలిపారు. బాలుడికి సకాలంలో వైద్య సేవలు అందించి, శస్త్రచికిత్స విజయవంతం కావడానికి కృషి చేసిన నీలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంఓ, సంబంధిత వైద్యులు, వైద్య సిబ్బందికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్యుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.

# బీజేవైఎం కొల్చారం మండల అధ్యక్షుడు అక్కెం ప్రవీణ్ యాదవ్ నియామకం



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం భారతీయ జనతా యువమోర్చా బీజేవైఎం కొల్చారం మండల అధ్యక్షుడిగా నియమితులైన అక్కెం ప్రవీణ్ యాదవ్‌కు బీజేపీ నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీజేపీ కొల్చారం మండల అధ్యక్షుడు ఘనపూర్ హరీష్ మాట్లాడుతూ, అక్కెం ప్రవీణ్ యాదవ్ పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలకు కట్టుబడి ఉంటూ యువతను సంఘటితం చేసి పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఆయన నాయకత్వంలో కొల్చారం మండలంలో యువమోర్చా మరింత బలోపేతం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు, పోతంశెట్టిపల్లి సర్పంచ్ పాతూరు దయాకర్ గౌడ్, బీజేపీ మెదక్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి యాదగిరి, బీజేపీ కొల్చారం మండల ప్రధాన కార్యదర్శులు గుండు నాని, పల్లె రవికాంత్ నేత, బీజేపీ మెదక్ జిల్లా మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షుడు మొహమ్మద్ ఖలీల్, బీజేవైఎం నాయకుడు నరేష్ తదితరులు పాల్గొని అక్కెం ప్రవీణ్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# కేటీఆర్ ను కలవడానికి తరలి వెళ్లిన గుండ్ల పోచంపల్లి బిఆర్ఎస్ నేతలు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )రాష్ట్ర మాజీ మంత్రి కేటీఆర్ సింగరేణి కార్మికుల సభా కు కరీంనగర్ కు వెళ్లిన సందర్భంగా ఆయనను కలిసేందుకు గుండ్ల పోచంపల్లి బిఆర్ఎస్ నేతలు భారీ ఎత్తున తరలి వెళ్లారు. శామీర్ పేట్ కట్టా మైసమ్మ గుడి దగ్గర కేటీఆర్ ను కలిసేందుకు గుండ్ల పోచంపల్లి డివిజన్ నుండి రాష్ట్ర నాయకులు మద్దుల శ్రీనివాస్ రెడ్డి అధ్యర్యంలో పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మద్దుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సభకు వెళుతున్న కేటీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిసేందుకు తరలి వెళ్లామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మేడ్చల్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు అమరం జైపాల్ రెడ్డి, బేరి బాల్రాజ్, ఆమరం హేమంత్ రెడ్డి, చింత పెంటయ్య, మరియు టిఆర్ఎస్ పార్టీ నాయకులు బండారి రాజు, ఓర్సు శ్రీహరి , కే ప్రతాప్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, మహేష్, చింత బాబు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# నవరాత్రుల ఐదో రోజు.. స్కందమాత అమ్మవారి అవతారం విశిష్టత

**బాలసుబ్రహ్మణ్యేశ్వరుడిని ఒడిలో ధరించిన జగన్మాత.. మాతృప్రేమ, కరుణ, శక్తికి ప్రతీకగా ఆదిశక్తి**



**ప్రశ్న న్యూస్ ప్రత్యేక కథనం మేడ్చల్ ప్రతినిధి చిన్న**

నవరాత్రి ఉత్సవాల్లో ఐదో రోజుకు విశేషమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. నవదుర్గలలో ఐదో రూపమైన స్కందమాత అమ్మవారిని ఈ రోజున భక్తులు భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. కుమారస్వామి, స్కందుడు, కార్తికేయుడు అని పిలిచే బాలసుబ్రహ్మణ్యేశ్వరుడిని ఒడిలో ధరించి దర్శనమిచ్చే ఈ అమ్మవారు మాతృప్రేమకు, కరుణకు, శక్తికి ప్రతీకగా నిలుస్తారు. భక్తులను తన బిడ్డలుగా భావించి కాపాడే జగన్మాతగా స్కందమాతను కొలుస్తారు.

### స్కందమాత అనే పేరు వెనుక అర్థం

'స్కందుడు' అంటే కుమారస్వామి లేదా కార్తికేయుడు. 'మాత' అంటే తల్లి. స్కందుడికి తల్లి కావడంతో పార్వతీదేవికి స్కందమాత అనే పేరు వచ్చింది. ఈమెను కుమారస్వామి తల్లిగా మాత్రమే కాకుండా, తనను ఆశ్రయించిన భక్తులందరినీ కరుణతో కాపాడే దైవమాతగా భక్తులు విశ్వసిస్తారు. స్కందమాత రూపం తల్లిప్రేమలోని గొప్పతనాన్ని, పిల్లల పట్ల తల్లి చూపే ఆప్యాయతను, కుటుంబంలో ప్రేమానురాగాల ప్రాధాన్యతను గుర్తుచేస్తుంది.

### అమ్మవారి దివ్యరూపం.. విశిష్టత

స్కందమాత అమ్మవారు సింహవాహనంపై ఆసీనురాలై దర్శనమిస్తారు. నాలుగు చేతులతో కనిపించే ఈమె రెండు చేతుల్లో కమలాలను ధరించి, మరో చేతితో బాల స్కందుడిని ఒడిలో ఉంచుకుని ఉంటారు. ఇంకో చేతితో భక్తులకు అభయాన్ని ప్రసాదించే ముద్రను ప్రదర్శిస్తారు. కొన్ని చిత్రణల్లో బాల స్కందుడు అమ్మవారి ఒడిలో కూర్చుని ఉంటాడు.
అమ్మవారి రూపంలోని కమలాలు పవిత్రతకు, ఆధ్యాత్మిక వికాసానికి ప్రతీకలు. సింహవాహనం ధైర్యసాహసాలను సూచిస్తుంది. ఒడిలోని బాలస్కందుడు మాతృప్రేమకు, తల్లీబిడ్డల అనుబంధానికి నిదర్శనంగా నిలుస్తాడు. ఆమె ప్రశాంతమైన ముఖం భక్తులకు మనశ్శాంతిని, భరోసాను అందిస్తుంది.

### పురాణ గాథలో స్కందమాత ప్రాధాన్యత

హిందూ పురాణాల ప్రకారం, దేవతలను వేధిస్తున్న తారకాసురుడిని సంహరించగల శక్తి శివపార్వతుల కుమారుడైన స్కందుడికే ఉందని వరం ఉండేది. లోకరక్షణ కోసం పార్వతీదేవి కుమారస్వామికి జన్మనిచ్చి, ఆయన దైవసేనకు నాయకుడిగా ఎదిగేందుకు కారణమయ్యారని పురాణ కథనాలు వివరిస్తాయి. అనంతరం స్కందుడు తారకాసురుడిని సంహరించి దేవతలకు ఉపశమనం కలిగించినట్లు కథనం చెబుతుంది. ఈ నేపథ్యంలో స్కందమాత రూపం మాతృశక్తికి, లోకకల్యాణానికి, ధర్మరక్షణకు ప్రతీకగా నిలుస్తుంది. పిల్లలకు ప్రేమతో పాటు ధైర్యం, ధర్మబుద్ధి, బాధ్యతలను నేర్పించడంలో తల్లి పాత్ర ఎంత ముఖ్యమో ఈ అవతారం తెలియజేస్తుంది.

### ఐదో రోజు పూజల విశిష్టత

నవరాత్రుల ఐదో రోజున భక్తులు స్కందమాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పుష్పార్చన, దీపారాధన, నైవేద్య సమర్పణతో పాటు అమ్మవారి నామస్మరణ, మంత్రపఠనం, ధ్యానం చేస్తారు. కుటుంబ సభ్యుల ఆరోగ్యం, పిల్లల అభివృద్ధి, కుటుంబ సుఖశాంతుల కోసం ప్రార్థిస్తారు. స్కందమాతను ఆరాధించడం వల్ల మనశ్శాంతి, ధైర్యం, శుభం కలుగుతాయని భక్తుల విశ్వాసం. పూజా విధానాలు, నైవేద్యాలు ప్రాంతీయ సంప్రదాయాలను బట్టి మారవచ్చు.

### నేటి సమాజానికి స్కందమాత సందేశం

ప్రస్తుత కాలంలో కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు బలంగా ఉండటం ఎంతో అవసరం. పిల్లల చదువు, భవిష్యత్తు, ప్రవర్తన విషయంలో తల్లిదండ్రుల ప్రేమతో పాటు మార్గదర్శకత్వం కూడా కీలకం. స్కందమాత అమ్మవారి అవతారం తల్లిదండ్రులు పిల్లలకు ప్రేమను పంచడంతో పాటు మంచి విలువలను నేర్పించాలని సూచిస్తుంది. పిల్లలకు ఆస్తిపాస్తులు అందించడం మాత్రమే కాదు.. ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, ఇతరుల పట్ల గౌరవం, కష్టాలను ఎదుర్కొనే ధైర్యం నేర్పించడం కూడా ముఖ్యమే. కుటుంబంలో పరస్పర గౌరవం, ఆప్యాయత, బాధ్యత పెరిగినప్పుడే సమాజం ఆరోగ్యకరంగా ఉంటుంది.

### మాతృప్రేమకు.. కరుణకు ప్రతీక

స్కందమాత అమ్మవారి అవతారం తల్లిప్రేమలోని అపారమైన శక్తిని చాటిచెబుతుంది. బిడ్డను ఒడిలో ధరించిన ఆమె రూపం రక్షణ, భరోసా, ఆప్యాయతలకు ప్రతీకగా నిలుస్తుంది. అదే సమయంలో సింహవాహనం ధైర్యంగా నిలబడాలని, ధర్మాన్ని కాపాడాలని సందేశమిస్తుంది. నవరాత్రుల ఐదో రోజున స్కందమాత అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తూ ప్రతి కుటుంబంలో ప్రేమానురాగాలు పెరగాలని, పిల్లలు మంచి మార్గంలో ఎదగాలని, సమాజంలో శాంతి సౌభ్రాతృత్వాలు వెల్లివిరియాలని కోరుకుందాం.

# బాలికపై లైంగిక దాడి.. నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష

**నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ అధికారులను అభినందించిన మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు తీర్పునిచ్చినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. కేసు వివరాలు వెల్లడిస్తూ. ఇక్కిరి శ్రీశైలం (25) ఆటో నడుపుతూ, ప్లంబర్‌గా జీవనం సాగించేవాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మెల్లూరు నుంచి తూప్రాన్‌కు ఆటో నడుపుతున్న సమయంలో కళాశాలకు వెళ్లేందుకు వేచి ఉన్న 17 ఏళ్ల బాలికను ఆటోలో ఎక్కించుకోవడంతో ఆమెతో పరిచయం ఏర్పడింది. అనంతరం ఇద్దరూ ఫోన్ నంబర్లు మార్చుకున్నారు. కొంతకాలం తర్వాత బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పగా ఆమె నిరాకరించింది. అయినప్పటికీ, బాలికను బలవంతంగా తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడాలని నిందితుడు పథకం వేశాడు. 16.04.2021న బాలిక కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లిన సమయంలో ఆమె ఇంటి వద్దకు వెళ్లి బైక్ ఎక్కాలని బలవంతం చేశాడు. బాలిక నిరాకరించడంతో కత్తితో బెదిరించి, బాసర, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం బాలిక తండ్రికి ఫోన్ చేసి తూప్రాన్‌లో ఉన్నట్లు సమాచారం ఇచ్చాడు. దీంతో తండ్రి బాలికను ఇంటికి తీసుకెళ్లాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు 27.04.2021న ఎల్దుర్తి ఎస్ఐ మహేందర్ కేసు నమోదు చేశారు. అప్పటి తూప్రాన్ డీఎస్పీ కిరణ్ కుమార్ దర్యాప్తు నిర్వహించి అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య కోర్టులో బలమైన వాదనలు వినిపించారు. దీంతో ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభవాలి నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో ఎస్ఐ కరుణాకర్ రెడ్డి, కోర్టు లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణ గౌడ్, సీడీఓ ప్రవీణ్ సహకరించారు. నిందితుడికి శిక్ష పడేలా సమన్వయంతో పనిచేసిన అధికారులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# మేధావులారా మేల్కోండి, సమయం లేదు:జేఎంఆర్

**- సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం**

**- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం**

**- బోయిన్ పల్లి ప్రాంతంలో గ్రాడ్యుయేట్లు వెయ్యిల సంఖ్యలో ఉన్నారు,కానీ ఓటు నమోదు కాకపోవడంతో వారితో భేటీ అయిన మాజీ వీపి:జేఎంఆర్**

**- నవంబర్ ఆరులోపే ఓటు నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలి,అది ఎలా అనే అంశం పై అవగాహన సదస్సు నిర్వహించారు**



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల వాతావరణం నెలకొంది. అన్ని పార్టీల నాయకులు కింది స్థాయి పార్టీ శ్రేణులతో భేటీ అయిన విషయం తెలిసిందే. అలాగే మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఈ మూడు జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న ఒకటోవ వార్డులో అత్యధికంగా గ్రాడ్యుయేట్లు ఉన్నట్లు తెలుసుకున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జక్కుల మహేశ్వర్ రెడ్డి సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలో నూతన గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమం పై బుధవారం ఉదయం న్యూ బోయినపల్లిలోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వార్డు పరిధిలో అర్హులైన గ్రాడ్యుయేట్లు,వారికి ఓటరు నమోదుపై అవగాహన కల్పించి,నూతన గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నియోజకవర్గం వార్డు ఇన్చర్జులకు సూచించారు. అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియ గురించి తెలుసుకొని, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం వారి పేర్లను నమోదు చేసుకునేలా ఇన్‌చార్జులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో తెలియజేశారు. అలాగే వార్డుల్లో ఉన్న బిఆర్ఎస్ శ్రేణులు సాంకేతిక పరికరాలతో ఫీల్డ్లో ఉంటూ అర్హులైన వారి వివరాలు తీసుకుని నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని,ఇలా చేసుకుంటూ పోతే త్వరలో అనుకున్న గమ్యం పూర్తి అవుతుందని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. వీలైనంత వరకు సగటున ప్రతి రోజూ ముప్ఫై నుంచి నలఫ్ఫై వరకు పూర్తి చేస్తే పార్టీ బలపరిచిన అభ్యర్థి సునాయాసంగా విజయం సొంతంతో పాటు మన కష్టాన్ని పార్టీ పెద్దలు గుర్తిస్తారు. ఇది మనకు వచ్చిన పెద్ద అవకాశం. మరో విషయం ఏమిటంటే దేవి నవరాత్రులు సందర్భంగా వీలైనంత వరకు గ్రాడ్యుయేట్లు ఇండ్లల్లోనే ఉంటారు మన పని కూడా తెలికగ పూర్తి అయిపోతుందని ఆయనన్నారు.

# జపాన్ ఫెస్టివల్ లో సత్తా చాటిన సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధి మైసమ్మగూడ లోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల జపాన్ ఫెస్టివల్--2026లో అంతర్జాతీయ స్థాయిలో విశేష గుర్తింపు సాధించింది. అక్టోబర్ 11న నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఇండియా-జపాన్ ఇన్నోవేషన్ హ్యాకథాన్‌లో భాగంగా నిర్వహించిన వివిధ ప్రాంతీయ హ్యాకథాన్‌ల అనంతరం, దేశవ్యాప్తంగా కేవలం 21 ఆవిష్కరణలు మాత్రమే జపాన్ ఫెస్టివల్‌లో ప్రదర్శనకు ఎంపిక కాగా, వాటిలో ఐదు ఆవిష్కరణలు సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందినవే కావడం విశేషం. అంతేకాకుండా, కళాశాలకు చెందిన ఒక ఆవిష్కరణ టాప్-5 అవార్డు పొందిన ఆవిష్కరణల్లో స్థానం సంపాదించింది. ఈ ఆవిష్కరణ భారతదేశం, జపాన్‌కు చెందిన అధికారులు మరియు పెట్టుబడిదారుల ప్రశంసలు, గుర్తింపును పొందింది. భారత్-జపాన్ సహకారాన్ని బలోపేతం చేయడంలో చేసిన కృషికి గాను కళాశాలకు "భారత్-జపాన్ సహకార వారధి" గుర్తింపు పురస్కారం కూడా లభించింది. ఈ కార్యక్రమంలో స్పెక్ విద్యార్థులు నిర్వాహక బృంద సభ్యులుగా, వాలంటీర్లుగా చురుకుగా పాల్గొని అంతర్జాతీయ వేదికపై కళాశాలకు ప్రాతినిధ్యం వహించారు. ఈ విజయంపై కళాశాల చైర్మన్ టి. బాలా రెడ్డి, సెక్రటరీ టి. వి. రెడ్డి, డైరెక్టర్లు శ్రీమతి టి. సరోజా రెడ్డి, టి. అనురాగ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. కె. వెంకట రావు విద్యార్థులు, అధ్యాపకులను అభినందించారు. అంతర్జాతీయ వేదికపై కళాశాలకు గుర్తింపు తీసుకురావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డా. గౌతమ్ మామిడిశెట్టి, డీన్ - ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ , కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, డీన్లు, విభాగాధిపతులు హెచ్ ఓ డి లు , బృందం, వివిధ విద్యార్థి క్లబ్‌లకు నిరంతర సహకారం, ప్రోత్సాహం, కృషికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం ఆవిష్కరణలు, పారిశ్రామికవేత్తల అభివృద్ధి, అంతర్జాతీయ భాగస్వామ్యాల దిశగా సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుంది.

# బెజవాడలో రాధా రాజకీయం

## - టీడీపీ నుంచి జనసేనకు.. రాజకీయ వ్యూహమా.? కొత్త ప్రస్థానమా.?

**- రంగా వారసుడి అడుగుపై ఆసక్తికర చర్చ.. - మేయర్ పీఠంపై ఊహాగానాలు.. జనసేనలో దక్కనున్న ప్రాధాన్యంపై ఉత్కంఠ**



**విజయవాడ(ప్రశ్న న్యూస్)** బెజవాడ రాజకీయాల్లో మరో కీలక పరిణామం! దివంగత వంగవీటి మోహన రంగా తనయుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ రాజకీయ ప్రస్థానం మరోసారి చర్చనీయాంశంగా మారింది. తెలుగుదేశం పార్టీ నుంచి జనసేనలోకి ఆయన అడుగుపెట్టడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమక్షంలో రాధాకృష్ణ పార్టీ



కండువా కప్పుకోవడంతో విజయవాడ రాజకీయ వర్గాల్లో కొత్త చర్చ మొదలైంది. అయితే ఈ రాజకీయ అడుగు వెనుక ఉన్న వ్యూహం ఏమిటి? రాధాకృష్ణకు జనసేనలో ఎలాంటి బాధ్యతలు దక్కనున్నాయి? విజయవాడ మేయర్ పదవిపై జరుగుతున్న చర్చలకు ఆయన చేరికతో ఏమైనా సంబంధం ఉందా.? ఇప్పుడు ఈ ప్రశ్నలే రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.రాధాకృష్ణ రాజకీయ నిర్ణయం కేవలం ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి మారడానికే పరిమితమవుతుందా? లేక తన రాజకీయ భవిష్యత్తుకు కొత్త దిశను నిర్దేశించుకునే ప్రయత్నమా? అన్నది రానున్న పరిణామాలపై ఆధారపడి ఉంటుంది.

### రంగా వారసత్వం.. రాధా రాజకీయ పయనం

వంగవీటి మోహన రంగా పేరు విజయవాడ రాజకీయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఆయన రాజకీయ ప్రస్థానం, ప్రజలతో ఉన్న అనుబంధం, అభిమాన వర్గం ఇప్పటికీ బెజవాడ రాజకీయ చర్చల్లో ప్రస్తావనకు వస్తుంటాయి. ఆ వారసత్వంతో రాజకీయాల్లోకి వచ్చిన వంగవీటి రాధాకృష్ణపై కూడా అభిమానులు, అనుచరులు ఎన్నో అంచనాలు పెట్టుకున్నారు.మాజీ ఎమ్మెల్యేగా పనిచేసిన రాధాకృష్ణకు విజయవాడ రాజకీయాలపై అవగాహన, స్థానికంగా పరిచయాలు, అనుచర వర్గం ఉన్నాయి. అయితే తండ్రి వారసత్వం రాజకీయంగా ఎంతటి గుర్తింపును తీసుకొచ్చినా, దానిని ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఎలా నిలబెట్టుకోవాలన్నది ఆయన ముందున్న సవాలు.రాజకీయాల్లో గత వైభవం ఒక్కటే భవిష్యత్తుకు భరోసా ఇవ్వదు. మారుతున్న సమీకరణాలను అర్థం చేసుకోవడం, పార్టీ నాయకత్వంతో సమన్వయం, ప్రజల్లో నిరంతర ఉనికి, రాజకీయంగా స్పష్టమైన కార్యాచరణ అవసరం. ఈ నేపథ్యంలో జనసేనలో రాధాకృష్ణ కొత్త ప్రస్థానం ఎలా సాగుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

### పార్టీ మార్పు వెనుక లెక్కలేంటి.?

తెలుగుదేశం పార్టీ నుంచి జనసేనలోకి రాధాకృష్ణ చేరిక రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. కూటమి ప్రభుత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పనిచేస్తున్న నేపథ్యంలో ఒక కూటమి భాగస్వామి నుంచి మరో భాగస్వామి పార్టీలోకి వెళ్లడం వెనుక రాజకీయంగా ఎలాంటి పరిణామాలు ఉంటాయన్న ప్రశ్నలు సహజంగానే తెరపైకి వస్తున్నాయి.అయితే పార్టీ మార్పునకు కారణాలు ఏమిటి? రాధాకృష్ణ స్వయంగా తన నిర్ణయంపై ఎలాంటి వివరణ ఇస్తారు? జనసేన నాయకత్వం ఆయనకు ఎలాంటి బాధ్యతలు అప్పగిస్తుంది? వంటి అంశాలపై అధికారికంగా వెల్లడైన వివరాల ఆధారంగానే స్పష్టతకు రావాల్సి ఉంటుంది.ఒక విషయం మాత్రం స్పష్టం. రాజకీయాల్లో పార్టీ మార్పు అనేది కేవలం కండువా మార్పుతో ముగిసిపోయే అంశం కాదు. ఆ తర్వాత లభించే బాధ్యతలు, పార్టీ కార్యక్రమాల్లో పాత్ర, ప్రజల్లో నాయకుడి చురుకుదనం, రాజకీయ నిర్ణయాల్లో భాగస్వామ్యం వంటి అంశాలే ఆ చేరికకు ఆచరణాత్మక ప్రాధాన్యాన్ని నిర్ణయిస్తాయి.

### మేయర్ పీఠం చుట్టూ చర్చ.. వాస్తవమెంత.?

విజయవాడ మేయర్ పదవికి సంబంధించి రాధాకృష్ణ పేరు వినిపిస్తుండటంతో రాజకీయ చర్చ మరింత ఆసక్తికరంగా మారింది. ఆయన జనసేనలో చేరికకు మేయర్ పదవి కూడా ఒక కారణమై ఉండవచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ఈ అంశంపై అధికారిక ప్రకటన లేదా ధ్రువీకరణ లేనంతవరకు దీనిని రాజకీయ చర్చగానే చూడాలి.మేయర్ పదవికి సంబంధించిన రిజర్వేషన్లు, ఎన్నికల ప్రక్రియ, కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ఎంపిక వంటి అంశాలు నిర్ణయాత్మకంగా ఉంటాయి. పార్టీ మారినంత మాత్రాన ఒక పదవి ఖాయమైందని భావించడం రాజకీయ వాస్తవాలకు విరుద్ధం.మేయర్ పదవి విషయంలో జనసేన నాయకత్వం ఏ విధమైన నిర్ణయం తీసుకుంటుంది? కూటమి పార్టీల మధ్య ఎలాంటి అవగాహన కుదురుతుంది? రాధాకృష్ణ పేరు అధికారికంగా పరిశీలనకు వస్తుందా? అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. మేయర్ పీఠమే లక్ష్యమా.? రాష్ట్ర రాజకీయాల్లో కీలక బాధ్యతలే ఆశయమా.?
అనే చర్చకు తెరపడాలంటే రాధాకృష్ణ రాజకీయ లక్ష్యం, పార్టీ నాయకత్వం వైఖరి స్పష్టంగా వెల్లడికావాల్సిందే.

### జనసేనలో రాధాకు ఎలాంటి పాత్ర.?

జనసేనలో చేరిన తర్వాత రాధాకృష్ణకు ఎలాంటి రాజకీయ బాధ్యతలు దక్కుతాయన్నది ఇప్పుడు కీలక అంశం. ఆయనకు పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో ప్రాధాన్యం లభిస్తుందా? విజయవాడ నగర రాజకీయాల్లో బాధ్యతలు అప్పగిస్తారా? పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై పనిచేసే అవకాశాలు కల్పిస్తారా? అన్న అంశాలపై ఆసక్తి నెలకొంది.పార్టీలో చేరిక మొదటి అడుగు మాత్రమే. ఆ తర్వాత నాయకత్వం అప్పగించే బాధ్యతలను నిర్వహించడం, పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేయడం, ప్రజలతో సంబంధాలను బలోపేతం చేసుకోవడం కీలకం. రాధాకృష్ణకు ఉన్న రాజకీయ అనుభవాన్ని జనసేన ఏ విధంగా వినియోగించుకుంటుందన్నది కూడా గమనించాల్సిన అంశమే.మరోవైపు, కూటమిలోని పార్టీల మధ్య స్థానిక స్థాయిలో సమన్వయం కూడా ముఖ్యమే. నగర రాజకీయాల్లో పార్టీ బలాబలాలు, స్థానిక నాయకుల మధ్య సంబంధాలు, కార్యకర్తల సహకారం వంటి అంశాలు ఏ నాయకుడి రాజకీయ భవిష్యత్తునైనా ప్రభావితం చేయగలవు.

### పదవి కంటే ప్రజల్లో పలుకుబడి ముఖ్యమా.?

వంగవీటి రాధాకృష్ణ రాజకీయ భవిష్యత్తుపై చర్చ జరుగుతున్న వేళ ఆయన ముందున్న అసలు సవాలు ప్రజల్లో తన రాజకీయ ప్రాధాన్యాన్ని మరింత స్పష్టంగా నిలబెట్టుకోవడమే. అభిమాన వర్గం, కుటుంబ వారసత్వం, గత రాజకీయ అనుభవం ఒక నాయకుడికి గుర్తింపును తీసుకురావచ్చు. కానీ ప్రజా సమస్యలపై స్పందించడం, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయడం, కార్యకర్తలకు అందుబాటులో ఉండటం వంటి అంశాలు ఆ గుర్తింపును నిలబెడతాయి.విజయవాడలో రహదారులు, పారిశుద్ధ్యం, తాగునీరు, ట్రాఫిక్, మౌలిక సదుపాయాలు వంటి నగర సమస్యలపై రాజకీయ నాయకులు చురుకుగా స్పందించాల్సిన అవసరం ఉంటుంది. నగర రాజకీయాల్లో ఎవరికి ఏ బాధ్యత లభించినా, ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేయడం ద్వారా మాత్రమే వారి నాయకత్వానికి ఆచరణాత్మక గుర్తింపు లభిస్తుంది.ఈ నేపథ్యంలో రాధాకృష్ణ తన రాజకీయ ప్రస్థానానికి ఎలాంటి కార్యాచరణను ఎంచుకుంటారు? జనసేన వేదికగా విజయవాడలో ఎలాంటి పాత్ర పోషిస్తారు? అన్నది ఆయన భవిష్యత్ రాజకీయ అడుగులపై ఆధారపడి ఉంటుంది.

### బెజవాడ రాజకీయాల్లో తదుపరి అడుగు ఏమిటి?

రాధాకృష్ణ జనసేనలో చేరికతో విజయవాడ రాజకీయాల్లో చర్చకు కొత్త అంశం చేరింది. ఒకవైపు రంగా వారసత్వంపై అభిమానుల అంచనాలు, మరోవైపు జనసేనలో ఆయనకు లభించే బాధ్యతలపై ఆసక్తి, ఇంకోవైపు మేయర్ పదవికి సంబంధించిన ఊహాగానాలు రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి.అయితే ఊహాగానాలకు, అధికారిక నిర్ణయాలకు మధ్య తేడాను గుర్తించడం అవసరం. మేయర్ అభ్యర్థిత్వం ఖరారైందని లేదా పార్టీ మార్పునకు అదే ప్రధాన కారణమని చెప్పడానికి ప్రస్తుతం నిర్ధారిత సమాచారం అవసరం.

రాధాకృష్ణ, జనసేన నాయకత్వం నుంచి వచ్చే స్పష్టమైన ప్రకటనలే ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వగలవు.టీడీపీ నుంచి జనసేనకు.. రాధాకృష్ణ రాజకీయ ప్రయాణంలో మరో అధ్యాయం ప్రారంభమైంది. ఈ అధ్యాయం ఆయనకు కొత్త బాధ్యతలను తెస్తుందా? విజయవాడ రాజకీయాల్లో మరింత చురుకైన పాత్రకు మార్గం వేస్తుందా? మేయర్ పదవిపై జరుగుతున్న చర్చలకు తెరదించుతుందా? అన్నది రానున్న పరిణామాల్లో తేలనుంది.

# 11 ప్లాట్లు.. 2,200 గజాల స్థలం హాంఫట్

## రూపాయి రూపాయి కూడబెట్టి కొనుగోలు చేసిన ప్లాట్లు కబ్జా

**- కోర్టులో కేసు నడుస్తుండగానే హద్దుల తొలగింపు.. మట్టి పోసి చదును చేశారంటూ బాధితుల ఆరోపణ**

**- సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని అధికారులకు బాధితుల విజ్ఞప్తి**




**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** కష్టపడి సంపాదించిన సొమ్మును రూపాయి రూపాయి కూడబెట్టి కొనుగోలు చేసిన ప్లాట్లు కబ్జాకు గురయ్యాయని 11 మంది బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ప్లాట్‌కు 2,200 గజాల విస్తీర్ణం అంటూ బాధితులు పేర్కొంటుండగా, మొత్తం 11 ప్లాట్లకు సంబంధించిన స్థల వివాదం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తమ పేర్లపై రిజిస్ట్రేషన్లు జరిగినప్పటికీ, తమ స్థలాలను కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై కోర్టులో కేసు కొనసాగుతుండగానే ప్లాట్ల హద్దులను తొలగించి, మట్టితో చదును చేసి, తమదేనంటూ బోర్డు ఎలా ఏర్పాటు చేశారని బాధితులు వాపోతున్నారు.

### 2010లో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు

బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్లపోచంపల్లి డివిజన్‌లో సర్వే నంబర్ 252లో అకౌంట్స్ జనరల్ ఆఫీస్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ స్థలాన్ని కొనుగోలు చేసింది. ఈ సొసైటీ ద్వారా 11 మంది ఉద్యోగులు ఒక్కొక్క ప్లాట్‌ను కొనుగోలు చేసి, 2010లో తమ తమ పేర్లపై రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు.అయితే 2014లో అదే సొసైటీకి చెందిన మరో వ్యక్తి ఈ 11 ప్లాట్లు తమవేనంటూ యజమానులపై కోర్టులో కేసు వేసినట్లు బాధితులు తెలిపారు. ఈ కేసు ప్రస్తుతం న్యాయస్థానంలో కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇటీవల సదరు వ్యక్తి ప్లాట్ల హద్దులను తొలగించి, మట్టితో చదును చేసి, ఆ స్థలం తమదేనంటూ బోర్డు ఏర్పాటు చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.




### రోడ్డు, డ్రైనేజీని సైతం వదల్లేదా.?

ప్లాట్ల హద్దులను తొలగించడమే కాకుండా, ఆ ప్రాంతంలోని రోడ్డు, డ్రైనేజీ స్థలాల్లోనూ మట్టి పోసి కబ్జాకు ప్రయత్నించారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ప్లాట్ల యజమానులు సంఘటనా స్థలానికి చేరుకుని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. కోర్టులో వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో స్థలంలో జరిగిన మార్పులపై అధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### పదవీ విరమణ తర్వాత ఆసరా అవుతాయని కొంటే..

ఉద్యోగ జీవితంలో కష్టపడి సంపాదించిన డబ్బుతో కొనుగోలు చేసిన ప్లాట్లు, పదవీ విరమణ తర్వాత తమకు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని ఆశించామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాంటి స్థలాలపై వివాదాలు సృష్టించి, తమకు నష్టం కలిగించడం అన్యాయమని వాపోతున్నారు. చట్టబద్ధంగా కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్లు చేయించుకున్నప్పటికీ తమ హక్కుల కోసం తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన చెందుతున్నారు.

### అధికారుల జోక్యం ఎప్పుడు.?

ఈ కబ్జా వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని బాధితులు మేడ్చల్ టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులను కోరుతున్నారు. స్థలాల హద్దులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, సర్వే వివరాలను పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే రోడ్డు, డ్రైనేజీ స్థలాల విషయంలోనూ విచారణ చేపట్టాలని కోరుతున్నారు. కోర్టులో కేసు కొనసాగుతున్న నేపథ్యంలో అసలు హక్కులు ఎవరికి ఉన్నాయి.? స్థలంలో హద్దులను తొలగించి మట్టి పోసిన ఘటనపై అధికారులు విచారణ చేపడతారా.? 11 మంది బాధితులకు న్యాయం జరుగుతుందా.? అనేది వేచి చూడాల్సి ఉంది.

# భక్తులకు అన్నప్రసాదం..

## సేవలో అమ్మవారి ఆలయం

**- అన్నప్రసాద సదనంలో వితరణను పరిశీలించిన చైర్మన్, ఈవో**

**- వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సదుపాయాలు**





**విజయవాడ(ప్రశ్న న్యూస్)** ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితోపాటు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా దేవస్థానం చర్యలు చేపడుతోంది. దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణతో పాటు వృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డల తల్లులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించడంపై అధికారులు దృష్టి సారిస్తున్నారు.

### భక్తులకు స్వయంగా అన్నప్రసాద వితరణ

శ్రీ కనకదుర్గ అన్నప్రసాద సదనంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన అన్నప్రసాద వితరణను దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వీకే శీనానాయక్ పరిశీలించారు. భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించి, వారి సంతృప్తి స్థాయిని అడిగి తెలుసుకున్నారు. అన్నప్రసాద సదనంలో అందుతున్న సేవలు, భోజన ఏర్పాట్లపై ఆరా తీశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్నప్రసాదం అందించడం దేవస్థానం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో ముఖ్యమైనది.

### వృద్ధులు, దివ్యాంగులకు అండగా..

నవరాత్రి ఉత్సవాలకు వచ్చే వృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డల తల్లులు ఎక్కువ దూరం నడవకుండా దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. వీల్‌చైర్ల ద్వారా దివ్యాంగులు, నడవలేని వృద్ధులను దర్శనానికి తీసుకెళ్తున్నారు. అవసరమైన ప్రాంతాల్లో బ్యాటరీ వాహనాల ద్వారా భక్తులను గమ్యస్థానాలకు చేరుస్తున్నారు.

### కొండ దిగువకు ఉచిత ప్రయాణం

భక్తుల సౌకర్యార్థం వ్యాన్లు, బస్సుల ద్వారా కొండ దిగువకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కూడా కల్పించారు. రద్దీ సమయంలో భక్తులు ఇబ్బందులు పడకుండా రవాణా ఏర్పాట్లు ఉపయోగపడుతున్నాయి. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, చిన్నపిల్లలతో వచ్చే తల్లులకు ఈ సదుపాయాలు ఉపయుక్తంగా ఉంటాయి.

### సేవలపై ప్రత్యేక దృష్టి

దసరా ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు దర్శనంతోపాటు అవసరమైన మౌలిక సదుపాయాలు అందించడం దేవస్థానం ముందున్న ప్రధాన బాధ్యత. అన్నప్రసాద వితరణ నుంచి రవాణా సౌకర్యాల వరకు భక్తులకు అందుతున్న సేవలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన అనుభూతి కల్పించడమే లక్ష్యంగా దేవస్థానం చర్యలు కొనసాగిస్తోంది. అమ్మవారి సన్నిధిలో అన్నదానం.. భక్తుల ప్రయాణంలో సహకారం.. సేవే లక్ష్యంగా ఇంద్రకీలాద్రి దేవస్థానం ఏర్పాట్లు సాగుతున్నాయి.

# జర్మనీలో ఘోర అగ్నిప్రమాదం

## - ముగ్గురు భారతీయుల సజీవ దహనం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** జర్మనీలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో ముగ్గురు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. బోచుమ్ నగరంలోని ఓ నివాస భవనంలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటనలో మరో ఐదుగురు గాయపడ్డారు. ఈ సంఘటనపై హత్య అనుమానంతో పోలీసులు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం బోచుమ్‌లోని హోఫ్‌స్టెడ్ జిల్లాలో ఉన్న ఓ నివాస భవనంలో మంగళవారం తెల్లవారుజామున మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం భవనంలోని రెండో అంతస్తులో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో ముగ్గురి మృతదేహాలను గుర్తించారు. మృతులను 25, 27 ఏళ్ల వయసున్న ఇద్దరు యువతులుగా, 26 ఏళ్ల యువకుడిగా గుర్తించారు. వీరంతా భారతీయులని అధికారులు నిర్ధారించారు.ఈ ప్రమాదంలో పొగ పీల్చడం వల్ల తీవ్ర అస్వస్థతకు గురైన మరో ఐదుగురిని చికిత్స కోసం స్థానిక ఆసుపత్రులకు తరలించారు. ప్రస్తుతం వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అయితే గాయపడిన వారి జాతీయతకు సంబంధించిన వివరాలు తెలియరాలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక విచారణ అనంతరం అదే భవనంలో నివసించే 41 ఏళ్ల రొమేనియా దేశస్థుడిని హత్య అనుమానంతో అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ అగ్నిప్రమాదం ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేశారా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588